



ESTD: 1999

www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ | 24-03-2026 మంగళవారం | సంపుటి : 27 | సంచిక : 21

SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY

రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on








# యుద్ధ విరామం

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఐదు రోజులు ఆపుతున్నాం : ట్రంప్ ప్రకటన

ఇరాన్‌తో చర్చలు ఫలవంతమైనట్టు వెల్లడి

ట్రంప్ ప్రకటనతో 10 శాతం తగ్గి క్రూడాయిల్ ధర



అమెరికాతో చర్చలు జరగడం లేదు

మా హెచ్చరికలతో భయపడి ట్రంప్ వెనకడుగు వేస్తున్నారు

ఆయన మరొకసారి దిగి వచ్చారు - ఇరాన్

2



# నిరాశ్రయులను చేయం

## మూసీ నిర్వాసితులకు సిఎం రేవంత్ హామీ

మూసీ ప్రక్షాళన కోసం చేపట్టే ప్రాజెక్టులో పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవరినీ నిరాశ్రయులను చేయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ ఒక్కరికీ నష్టం జరక్కుండా వారందరికీ మరింత మెరుగైన వసతులతో ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.



- మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తాం
- నల్గొండ ప్రజల ఇబ్బందులు తెలిసిన నాయకులెవరూ ఈ ప్రాజెక్టును అడ్డుకోరు
- మూసీ ప్రక్షాళన అంశంపై సలహాలు, సూచనల కోసం డిప్యూటీ సీఎం అధ్వర్యంలో కమిటీ

శాసన మండలిలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి23 ( వుదయం ప్రతినిధి) :** మూసీ ప్రక్షాళన కోసం చేపట్టే ప్రాజెక్టులో పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవరినీ నిరాశ్రయులను చేయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు, ఏ ఒక్కరికీ నష్టం జరక్కుండా వారందరికీ మరింత మెరుగైన వసతులతో ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు సహాయాన్ని అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.మూసీ ప్రక్షాళనకు సంబంధించిన ప్రణాళికలను క్షుణ్ణంగా చదివి, ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు చేస్తే ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని చెప్పారు.హైదరాబాద్ నగర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలు, 1 లక్షకు పైగా చ.కి.మీ మేర విస్తరించిన రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ దార్శనికతను ఈ సందర్భంగా సీఎం సభముందు సమగ్రంగా వివరించారు. సీఎం వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే..

దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో తలెత్తుతున్న విషమ పరిస్థితులను గమనంలోకి తీసుకుని చరిత్రాత్మక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవం తీసుకురావడానికి, అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుకోవలసిన అవ సరం ఉంది. నల్గొండ ప్రజల జీవన స్థితిగతులు, వారి ఆవేదనా భరితమైన జీవిత సత్యాల గురించి ఆలోచన చేసే వారెవరూ ఈ ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన చేయరు. కావాలనుకుంటే మూసీ ప్రక్షా ళన అంశంపై సలహాలు, సూచనలు తీసుకోవడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తాం. ఏ రాష్ట్ర ప్రగతి అయినా ఆ రాష్ట్ర నగరాలు, పెట్టుబడు లు, ప్రజల జీవన స్థితిగతులపై ఆధారపడి ఉంటా యి.

మిగతా 2లో

## మధు రెడ్డి మాకు వద్దు

అసెంబ్లీలో సిఎం రేవంత్

- మీ స్థలం.. మాకు అక్కరలేదు
- మూసీ బఫర్ జోన్ తో నివాసితులకే ప్రాబ్లం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

2

## యుద్ధ జ్వాలల్లోనూ

# ఇంధన భద్రత

### ఇంధన సరఫరాలు ప్రభావితం కాకుండా చర్యలు : ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 23 (వుదయం) :** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ హొర్మూజ్ జల సంధి ద్వారా సరుకు రవాణా క్లిష్టతరమైనప్పటికీ, గ్యాస్, ఇంధన సరఫరాలు ప్రభావితం కాకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ యుద్ధం భారత్ ఎదుట ఎన్నో సవాళ్లను ఉంచిందని ఆయన అన్నారు. యుద్ధ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ఆయన సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. ఎల్ పిజి విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. సంఘర్షణ మూడు వారాలకు పైగా కొనసాగుతోందని, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైన, ప్రజల జీవితాలపైన తీవ్ర ప్రభావాన్ని చూపగలదని, అందుకే ఈ ఘర్షణను త్వరితగతిన పరిష్కరించాలని ప్రపంచం విజ్ఞప్తి చేస్తోందని ఆయన అన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, హొర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలు అత్యంత సవాలుగా మారినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా చూసేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందని ఆయన తెలిపారు. అందరికీ తెలిసినట్లుగా, దేశానికి అవసరమయ్యే మొత్తం ఎల్పిజిలో60 శాతాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నామనీ, సరఫరాలో నెలకొన్న అనిశ్చితి దృష్ట్యా, ప్రభుత్వం దేశీయ ఎల్పిజి వినియోగదారులకు అగ్ర ప్రాధాన్యతనిచ్చిందని పేర్కొన్నారు. అదే సమయంలో, దేశీయంగాఎల్‌పిజి ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని, దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్

మిగతా 2లో

## రోహిత్‌రెడ్డి అరెస్టుకు కోర్టు అనుమతి

- ఆయన సోదరుడు, ఢిల్లీ వ్యాపారవేత్త నమిత్ శర్మ కస్టడీకీ గ్రీన్ సిగ్నల్
- మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

2



## ప్రజలను తాగుబోతుల్ని చేసింది మీరే

- మీరు అధికారం కోల్పోయినప్పటికి ఎక్సైజ్ రాబడి 36 వేల కోట్లకు పెరిగింది
- బీఆర్ఎస్ పై మంత్రి జూపల్లి



2

## దానంకు, స్పీకర్ కు హైకోర్టు నోటీసులు

ఫిరాయింపుల కేసులో స్పీకర్ తీర్పు రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, మార్చి 23 (ఎఎంఎస్) :** పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. స్పీకర్ తీర్పుతో ఈ వ్యవహారం ముగిసిపోయింది అనుకుంటున్న తరుణంలో.. మరోసారి తెరపైకి వచ్చింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో దానం నాగేందర్ విషయంలో స్పీకర్ తీర్పును కొట్టేయాలని.. హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

మిగతా 2లో



## విచారణ అంటే అలుసా?

వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉండదు

ఫైనాన్స్ సెక్రెటరీ వచ్చి తీరాల్సిందే : హైకోర్టు

2

# గ్యారంటీల అమలెక్కడ?

## రుణమాఫీపై ప్రభుత్వం చెప్పుతున్నదానికి వాస్తవానికి పొంతన లేదు : హరీశ్ రావు



**హైదరాబాద్, మార్చి 23 (ఎఎంఎస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. "భట్టి విక్రమార్క మాటలకు అర్థాలే వేరులే అన్నట్టుగా రాష్ట్ర పరిస్థితి ఉంది" అంటూ ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని ఆరోపించారు. వేలాది మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ వర్తించలేదని, రైతులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సంద ర్భంగా సోమవారం ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీలతో పాటు క్షేత్రస్థాయిలో గ్యారంటీల అమలు తీరుపై ప్రభుత్వాన్ని నిలదీశారు. గతం లో కరోనా వంటి కష్టకాలంలో కూడా తాము (బీఆర్ఎస్) రైతుబంధును నిరంతరాయంగా ఇచ్చామని హరీష్ రావు తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఎన్నికలు వచ్చినప్పుడే రైతు భరోసా ఇస్తోందని,

మిగతా 2లో

# ఫీజుల బకాయిలపై బిఆర్ఎస్ నిరసన

**హైదరాబాద్, మార్చి 23 ( వుదయం ప్రతినిధి) :** అసెంబ్లీ ప్రాంగణం బీఆర్ఎస్ సభ్యుల నిరసనలతో మార్మో గింది. రాష్ట్రంలోని పేద విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రె స్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో భారీ నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నట్టే, ఇప్పుడు విద్యార్థుల

మిగతా 2లో




## చమురు ధర పెరిగి తగ్గింది ఇలా

**వుదయం డెస్క్, మార్చి 23 :** ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ముడి చమురు ధరలు ప్రారంభంలో వచ్చిన లాభాలను కోల్పోయి లోయర్ సర్క్యూట్‌కు పడిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మార్కెట్లను కుదిపేస్తున్న ఈ పెరుగుతున్న ముడి చమురు ధర, ఫ్యూచర్స్ ట్రేడ్‌లో 9 శాతం తగ్గి బ్యారెల్‌కు రూ. 8,431కి చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో, ఏప్రిల్ డెలివరీకి సంబంధించిన ముడి చమురు ధరలు లాభాలతో ప్రారంభ మై, ఇంట్రాడే గరిష్ట స్థాయిగా బ్యారెల్‌కు రూ. 9,620కి చేరుకున్నాయి. అయితే, రోజు గడిచే కొద్దీ ధరలు 9 శాతం మేర పడిపోయి, బ్యారెల్‌కు రూ. 8,431కి చేరాయి. విదేశీ మార్కెట్లలో ముడి చమురు ధరలు కూడా తగ్గాయి. న్యూయార్క్‌లో, మే నెల కాంట్రా క్టుకు సంబంధించినవెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటిఐ) ఫ్యూచర్స్ ధర 7.24 డాలర్లు (7.37 శాతం) తగ్గి, బ్యారెల్‌కు 90.99 డాలర్లకు చేరుకుంది; అదే సమ యంలో, అదే నెల డెలివరీకి సంబంధించిన బ్రెంట్ ముడి చమురు ధర 6.70 డాలర్లు (6.30 శాతం) తగ్గి, బ్యారెల్‌కు 99.71 డాల ర్లకు పడిపోయింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మద్దతుతో, సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో డబ్ల్యూటిఐ క్రూడ్ ఫ్యూ చర్స్ 101.5 డాలర్ల గరిష్ట స్థాయికి చేరిన తర్వాత బ్యారెల్‌కు 98 డాలర్ల సమీపంలోకి వచ్చాయి. హొర్ముజ్ జలసంధి చుట్టూ నెల కొన్న అంతరాయాలు సరఫరాపై తీవ్ర ప్రభా వం చూపడంతో, ఇరాన్ సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి చమురు ధరలు 50% పెరిగాయి.

# బియ్యం ఎగుమతి సఫలం

## ఎగుమతుల వల్ల తగ్గిన రూ.13 కోట్ల రూపాయల భారం, పెరిగిన ధర

- 27,750 మెట్రిక్ టన్నుల ఎగుమతిలో తెలంగాణా ఘన విజయం
- థాయ్ లాండ్, వియత్నాం, కంబోడియా దేశాల బియ్యం బ్రాండ్ల సరసన తెలంగాణ
- బియ్యం ఎగుమతికై సిఫార్సు చేసిందే హరీష్ రావు
- పౌర సరఫరాల శాఖ వద్ద నిలువ ఉన్న 86 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- ధాన్యం కొనుగోలుకు చేసిన రుణాలపై భారీగా వడ్డీ భారం
- అయినా రైతుల ప్రయోజనార్థం కొనసాగుతున్న కొనుగోళ్ల ప్రక్రియ
- ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం 72 లక్షల మెట్రిక్ టన్నులు
- కేంద్ర ప్రభుత్వం 54 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు పరిమితము
- హౌస్ కమిటీ అంటూ వేస్తే హరీశ్ రావు ప్రభుత్వంలో జరిగిన ఒప్పందాల పరిశీలనకే పరిమితము కావాలి
- శాసనసభలో హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కౌంటర్



**హైదరాబాద్, మార్చి23 ( వుదయం ప్రతినిధి) :** అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్ర పౌర సరఫరాల శాఖాపై 13 కోట్ల భారం తప్పినట్లైందని పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 2లో

# డీలిమిటేషన్ తో మహిళలకు 50 ఎమ్మెల్యే సీట్లు

## టిపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మార్చి23 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని నియోజకవర్గాల అసెంబ్లీ డీలిమిటేషన్ జరిగితే 40 నుండి 50 సీట్లు మహిళలవేనని, జిల్లా నుండి నలుగురు లేదా ఐదుగురిని నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మహిళలకు చట్ట సభలలో అధిక సీట్లు రానున్నాయని, రిజర్వేషన్లు ప్రకారమే కాకుండా బలమైన నాయకులుంటే ఎక్కువ సీట్లు ఇస్తామన్నారు.

**మహిళలది కీలకపాత్ర**

పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రోహిత్‌రెడ్డి అరెస్టుకు కోర్టు అనుమతి

**హైదరాబాద్, మార్చి 23 (ఎంఎస్) :** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి,ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమిత్ శర్మలను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. నిందితులను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ముగ్గురిని విచారించడం ద్వారా డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలను, సరఫరాదారుల వివరాలను రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. కాగా ఈ నెల 14న మొయినాబాద్‌లోని రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌పై ఈగల్ టీమ్ నిర్వహించిన దాడుల్లో డ్రగ్స్‌తో పాటు ఆయుధాలు కూడా లభ్యమయ్యాయి. సోదాల సమయంలో నమిత్ శర్మ పోలీసులపైకి కాల్పులు జరపడం కలకలం రేపింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న వీరిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని, విచారణ నిమిత్తం రహస్య ప్రాంతానికి తరలించే అవకాశం ఉంది. డ్రగ్స్ పార్టీ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? ఇంకా ఎవరెవరికి ఇందులో ప్రమేయం ఉందనే కోణంలో 'సిట్' అధికారులు తమ దర్యాప్తును వేగవంతం చేయనున్నారు.

## ప్రజలను తాగుబోతుల్ని చేసింది మీరే

**హైదరాబాద్, మార్చి 23 (ఎంఎస్) :** రాష్ట్రంలో మద్యాన్ని ప్రోత్సాహించిందెవరు?.. తెలంగాణ ప్రజలను తాగుబోతులను చేసింది ఎవరో ప్రస్తుత లెక్కలను చూస్తే తెలిసిపోతుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. 60 ఏళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.65 వేల కోట్లకు మించి పోలేదని.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో లక్షల కోట్లకు చేరిందని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడి.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.10 వేల కోట్ల లోపు ఉండేదని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయే నాటికి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.36 వేల కోట్లకు పెరిగిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.2 వేల కోట్లు తగ్గిందని చెప్పారు.

## విచారణ అంటే అలుసా?

**హైదరాబాద్, మార్చి 23 (ఎంఎస్) :** రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బకాయిల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యంపై హైకోర్టు సీరియస్ అయింది. ఈ విచారణకు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాలని గతంలోనే ఆదేశించినప్పటికీ, ఆయన హాజరుకాకపోవడంపై ధర్మాసం అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఆ పనుల్లో నిమగ్నమై ఉండటంతోనే ఫైనాన్స్ సెక్రటరీ విచారణకు రాలేకపోయారని కోర్టుకు వివరించారు. ఈ కారణంతో ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, ఈ విన్నపాన్ని హైకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేయడంపై ధర్మాసనం నిప్పులు చెరిగింది. 'రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదు. కోర్టు ఆదేశించినా అధికారి రాకపోవడం ఏంటి?' అని ప్రశ్నించింది. తాము ఇవాళ అర్ధరాత్రి వరకు కోర్టు హాలులోనే ఉంటాం.. కానీ ఫైనాన్స్ సెక్రటరీ మాత్రం ఖచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందేనని కోర్టు పేర్కొంది. ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి ఎలాంటి మినహాయింపు ఇచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.కాగా రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలు గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. తమ జీవితకాలపు పొదుపు మొత్తాల కోసం వృద్ధాప్యంలో కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కోర్టు స్పందిస్తూ ఆర్థిక శాఖను వివరణ కోరింది. ఈ క్రమంలోనే మరి కాసేపట్లో ఫైనాన్స్ సెక్రటరీ కోర్టు ముందు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ కేసులో కోర్టు ఎలాంటి కీలక ఆదేశాలు జారీ చేస్తుందోనని ఆసక్తికరంగా మారింది.

## దానంకు, స్పీకర్ కు హైకోర్టు నోటీసులు

మొదటి పేజీ తరువాయి

దీంతో విచారణ జరిపిన హైకోర్టు.. దానం నాగేందర్‌కు నోటీసులు ఇచ్చింది. అసెంబ్లీ కార్యదర్శికి కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో సంచలనం రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఇటీవలే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇస్తూ.. స్పీకర్ తన తుది నిర్ణయాన్ని వెలువరించారు. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్ దక్కినట్లు అయింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పును ఇచ్చారు. అయితే ఇప్పుడు ఈ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. స్పీకర్ తీర్పును కొట్టివేయాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు.. నోటీసులు జారీ చేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని.. పిటిషనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచారని.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే.. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినట్లు పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకే దానం నాగేందర్ వ్యవహారంలో స్పీకర్ తీర్పు సరైంది కాదని.. దాన్ని కొట్టేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీ ఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌ను.. ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టుకు విన్నవించారు.బీఆర్ఎస్ పార్టీ నుంచి కాకుండా ఇతర పార్టీ నుంచి ఎంపీగా నామినేషన్ వేసిన రోజు నుంచే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని పిటిషనర్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో కర్ణాటక, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రస్తావించారు. అదే సమయంలో స్పీకర్ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి.. ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో ఇటీవలె సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్‌తో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో తర్వాతి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఇప్పుడు స్పీకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎలాంటి వివరణ ఇస్తారు అనే దానిపై అందరి దృష్టి పడింది.

## ఫీజుల బకాయిలపై బిఆర్ఎస్ నిరసన

మొదటి పేజీ తరువాయి

జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక వేల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం మరింత పటిష్టంగా కొనసాగించి విద్యార్థుల బంగారు బాటకు మార్గం చూపిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల కనీస చిత్తశుద్ధి లేదని, తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ నిరసనలో పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

## గ్యారంటీల అమలెక్కడ?

మొదటి పేజీ తరువాయి

ఒక్క పంటకు కూడా సరిగ్గా పెట్టుబడి సాయం అందడం లేదని విమర్శించారు. రైతు భరోసాను రూ. 15 వేలకు ఎప్పుడు పెంచుతారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు ఇస్తామన్న బోనస్ హామీ కేవలం 'బోగస్'గా మిగిలిపోయిందని, అటు రైతు కూలీలను కూడా ప్రభుత్వం దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల అన్నదాతలు అయోమయంలో ఉన్నారని, ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**మంత్రి జూపల్లికి కౌంటర్..**

'2026–27 ఆర్థిక సంవత్సరంలో రూ.46,941 కోట్లు ఎక్సైజ్ మీద ఆదాయం వస్తుందని చెప్పా రు. గత సంవ త్సరం కంటే దాదాపు 12 వేల కోట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని అం టున్నారు. అంత ఆదాయం రావాలంటే 25వేల కోట్లు మద్యం అమ్మాలి. ఏకంగా 35% ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్తున్నారంటే, గల్లీకొక బెల్టు షాపు పెడతారా?' అని మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు.

# యుద్ధ విరామం

**వుదయం డెస్క్, మార్చి 23 :** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు తగ్గే అవకాశాన్ని సూచిస్తూ, అమెరికా, ఇరాన్‌ల మధ్య ఫలవంతమైన, మంచి చర్చలు జరిగాయని పేర్కొంటూ, సైనిక దాడులకు ఐదు రోజుల విరామాన్ని ప్రకటించినట్టు యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వెల్లడించారు. నాలుగవ వారంలోకి ప్రవేశించిన యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను వణికిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం విశేషం. ముఖ్యంగా, హొర్మూజ్‌ను 48 గంటలలోపు పూర్తిగా తెరవకపోతే, వారి ఇంధన మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామంటూ ట్రంప్ హెచ్చరించిన మరురోజే ఈ ప్రకటన వెలువడింది. మధ్యప్రాచ్యంలో మా మధ్య నెలకొన్న శత్రుత్వాలకు, వైరుధ్యాలకు సంపూర్ణ, సమగ్ర పరిష్కారాన్ని కనుగొనే దిశగా, గత రెండు రోజులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇరాన్ మధ్య అత్యంత సానుకూలమైన, ఫలప్రదమైన చర్చలు జరిగాయని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. ఈ వారం అంతా కొనసాగనున్న ఈ లోతైన, వివరణాత్మక, నిర్మాణాత్మక చర్చల తీరుతెన్నులను, వాటి స్వరూపాన్ని పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు, చర్చలు విజయవంతం కావడాన్ని బట్టి ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు ,ఇంధన మౌలిక సదుపాయాలపై చేపట్టాల్సిన ఎటువంటి సైనిక దాడులనైనా ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని నేను యుద్ధ శాఖను ఆదేశించాను అంటూ అధ్యక్షుడు ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో వివరించారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే కాబాల్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయం స్పందిస్తూ, ఇరాన్ చేసిన కఠిన హెచ్చరిక కారణంగానే ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేయకుండా ట్రంప్ వెనక్కి తగ్గారని పేర్కొంది. ట్రంప్ ఇచ్చిన 48 గంటల అల్టిమేటంపై స్పందిస్తూ, యుఎస్, ఇజ్రాయెల్‌ను సూచిస్తూ, శత్రువుల నౌకలకు మినహా జలసంధి అందరికీ తెరిచే ఉంటుందని ఇరాన్ ప్రకటించింది. గల్ఫ్‌లో సముద్ర భద్రతను పెంపొందించడానికి, నావికులను రక్షించడానికి అంతర్జాతీయ సముద్ర సంస్థ (ఐఎంఒ)తో సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, ఇరాన్ శత్రువులతో సంబంధం లేని ఓడలు తెహ్రాన్‌తో భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేసుకుని జలసంధి గుండా ప్రయాణించవచ్చు, అని ఐఎంఒలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అలీ మౌసావి చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. దౌత్యం ఇరాన్‌కు ప్రాధాన్యతగా ఉంటుంది. అయితే, దురాక్రమణను పూర్తిగా నిలిపివేయడంతో పాటు, పరస్పర నమ్మకాన్ని, విశ్వాసాన్ని పునర్నిర్మించుకోవడం అత్యవసరం. హొర్ముజ్ జలసంధిలో ప్రస్తుత పరిస్థితికి ఇజ్రాయెల్, అమెరికా ఇరాన్‌పై చేస్తున్న దాడులే మూల కారణం," అని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 28న జరిగిన అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ప్రతిస్పందనగా, ఇరాన్ హొర్ముజ్ జలసంధి గుండా రాకపోకలకు అంతరాయం కలిగించడంతో ఇటీవలి వారాల్లో ఈ ఘర్షణ తీవ్రమైంది. తెహ్రాన్ ఇజ్రాయెల్ భూభాగంపై దాడులు చేయడంతో పాటు, అమెరికా సైనిక స్థావరాలు ఉన్న గల్ఫ్ దేశాలను కూడా లక్ష్యంగా చేసుకుంది. తమ ఇంధన మౌలిక సదుపాయాలపై ఎలాంటి దాడి జరిగినా, ఈ ప్రాంతమంతటా ప్రతీకార దాడులు జరుగుతాయని ఇరాన్ ఏకీకృత పోరాట దళం హెచ్చరించింది. ఇరాన్ మీడియా ప్రకారం, ఇరాన్ సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటే, ఈ ప్రాంతంలోని అమెరికాకు చెందిన అన్ని ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటాం అని అది పేర్కొంది. ఇరాన్ తొలిసారిగా సుదూర క్షిపణులను ప్రయోగించిందని ఇజ్రాయెల్ ధృవీకరించడంతో, పరిస్థితి మరింత ఉద్రిక్త దశలోకి ప్రవేశించింది. డిగో గార్సియాలోని యూఎస్–యూకే సైనిక స్థావరం వైపు 4,000 కిమీ పరిధి గల రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ సైనిక అధిపతి ఐయాల్ జమీర్ తెలిపారు. ఈ క్షిపణులు ఇజ్రాయెల్‌పై దాడి చేయడానికి ఉద్దేశించినవి కావు. వాటి పరిధి ఐరోపా రాజధానులైన బెర్లిన్, పారిస్, రోమ్‌ల వరకు విస్తరించి ఉంది. ఇవన్నీ ప్రత్యక్ష ముప్పు పరిధిలోనే ఉన్నాయి, అని జమీర్ అన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ కారణంగా మృతుల సంఖ్య పెరుగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్‌లో 2,000 మందికి పైగా మరణించినట్లు నివేదికలు రాగా, ఇజ్రాయెల్‌లో ఇరాన్ దాడుల వల్ల కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల జరిగిన క్షిపణి దాడులు డిమోనా, అరద్ వంటి దక్షిణ ఇజ్రాయెల్ నగరాలపై జరిగాయి, ఈ దాడుల్లో పలువురు పౌరులు గాయపడ్డారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, మేము అన్ని వైపుల నుంచి మా శత్రువులపై దాడులు కొనసాగించడానికి నిశ్చయించుకున్నాము, అని అన్నారు.

# మధు రిడ్జి మాకు వద్దు : అసెంబ్లీలో సిఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి23 (వుదయం ప్రతినిధి) :** గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం మధు రిడ్జ్ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవడం లేదని, 50 మీటర్ల బఫర్ జోన్లో ఉందని భవిష్యత్తులోనూ వారికి నష్టమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో అత్యంత వివాదాస్పదమైన మధు రిడ్జ్ పార్క్ అపార్ట్‌మెంట్ స్థలంపై అసెంబ్లీ వేదికగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి మధు రిడ్జ్ పార్క్ అపార్ట్‌మెంట్ స్థలం తీసుకోకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఆ అపార్ట్‌మెంట్ స్థలాన్ని ప్రభుత్వం అడగలేదని ఆయన తేల్చి చెప్పారు. మూసీ బఫర్ జోన్ వల్లే అపార్ట్‌మెంట్ వాసులకు నష్టం వాటిల్లుతుందని, భూమి ఇస్తే కనుక వారికి పరిహారం చెల్లించి ప్రత్యామ్నాయం చూపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

**బఫర్ జోనే..** గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన 98 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, అది తమకు సరిపోతుందని ఆయన వివరించారు. 2005–06లో అపార్ట్‌మెంట్ వాసులు దాన్ని చిన్న నాలాగా చూపించి పర్మిషన్ తీసుకున్నారు. 2012, 2016లో పరిశీలిస్తే 50 మీటర్లలో బఫర్ జోన్ ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అపార్ట్ మెంట్ సగం వరకు బఫర్ జోన్లో ఉందని క్లారిటీ ఇచ్చారు.

**పరిహారం చెల్లింపుపై ప్రకటన**

అపార్ట్‌మెంట్ వాసులకు ఉన్న అసలు సమస్య బఫర్ జోన్ మార్పు వల్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో యజమానులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బఫర్ జోన్ నిబంధనల కారణంగా ఆ అపార్ట్‌మెంట్‌ను భవిష్యత్తులో ఎవరూ కొనలేరని, అమ్మలేరని, అది దేనికీ పనికిరాకుండా పోతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవేళ మధు రిడ్జ్ అపార్ట్‌మెంట్ కు సంబంధించిన స్థలాన్ని అభివృద్ధి కోసం ప్రభుత్వానికి ఇస్తే కనుక వారికి నష్ట పరిహారం ఇచ్చి, ప్రత్యామ్నాయం చూపించేందుకు ప్రభుత్వానికి ఏ ఇబ్బంది లేదని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



**కొనుగోలుదారుల జాగ్రత్త**

ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులోనూ ప్రయోజనం ఉండదని, దాని వల్ల కొనుగోలుదారులే నష్టపోతారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం స్థలం అడుగుతోందన్న ప్రచారాన్ని తోసిపుచ్చుతూ, కేవలం నిబంధనల పరంగా ఉన్న చట్టపరమైన చిక్కుల గురించే తాము ప్రస్తావిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**మా ఇండ్లే మాకు కావాలి..**

**పరిహారం వద్దు: మధు పార్క్ రిడ్జ్ నివాసితులు**

రంగారెడ్డి జిల్లాలోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ నివాసితులు ఇటీవల ప్రధాన రహదారి పక్కన శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. తమ ఇళ్లను కూల్చివేయవద్దని, తమకు ఎలాంటి పరిహారం వద్దని చెప్పారు. ఎన్నో ఏళ్ల కష్టార్జితంతో కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, కానీ తమ ఇండ్లను కూలగొడితే చూస్తూ కూర్చునేది లేదన్నారు.

**ప్రభుత్వంపై అపార్ట్మెంట్ వాసుల ఆగ్రహం**

సీఎం రేవంత్ రెడ్డి తమ ఇళ్లకు జీరో వ్యాల్యూ అని ప్రకటించడంపై మధు రిడ్జ్ అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్ని అనుమతులు తీసుకుని నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు బఫర్ జోన్ అని సాకులు చెప్పి పనికిరాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇండ్లను కూల్చేందుకు బుల్డోజర్లు వస్తే వాటి కింద పడుకుంటాం తప్ప కష్టపడి కట్టుకున్న ఇళ్లను వదులుకోం.. అవసరమైతే చావడానికైనా సిద్ధమని ఇటీవల తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

## నిరాశ్రయులను చేయం

మొదటి పేజీ తరువాయి

140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో ఎప్పుడు చర్చ జరిగినా ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై నగరాల గురించి ఎక్కువగా చర్చిస్తారు. హైదరాబాద్ అనగానే ప్రధానంగా ఫార్మా రంగంతో పాటు లివబుల్ సిటీగా గుర్తుచేసుకుంటారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా ఉన్న ముంబై వర్షాలొస్తే నివసించలేని పరిస్థితి. దేశ రాజధాని ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం, బెంగళూరులో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా విపరీతమైన ట్రాఫిక్ జామ్‌లు. భారీ వర్షాలొస్తే చెన్నైలో పడవలపై ప్రయాణించాల్సిన పరిస్థితి.ఆ మహానగరాల్లో ఎదురవుతున్న అనుభవాలను చూసిన తర్వాత అత్యంత ప్రశాంత వాతావరణంలో, ఒకప్పుడు లేక్ అండ్ రాక్ సిటీగా విలసిల్లిన చారిత్రాత్మక హైదరాబాద్ ఇప్పుడు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఆ సమస్యలు భూభౌగోళిక పరిస్థితుల కారణంగా తలెత్తినవి కాదు.

**మానవ తప్పిదాల కారణంగా తలెత్తిన సమస్యలు.**

కులీకుతుబ్ షాహీల కాలంలో గుల్జార్ హౌజ్, ఫలక్‌నుమా, తారామతి భారాదరి, ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీల నుంచి మొదలు పెడితే ఈరోజు సమావేశాలు నిర్వహించుకుంటున్న శాసనమండలి హాలు.. ఇలా ఎంతో చరిత్ర కలిగిన అద్భుతమైన నగరం ఇప్పుడు కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందుల వంటి ఎన్నో సమస్యలతో సతమతమవుతోంది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ మూడు ప్రాంతాలుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ఒక కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. 1.34 కోట్ల జనాభా కలిగిన ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి కాలుష్య కారక రెడ్, ఆరెంజ్ జోన్‌లో ఉన్న పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని నిర్ణయించాం. తద్వారా ఈ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. పరిశ్రమలను తరలించడం ద్వారా నగరం కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందన్నది మొట్టమొదటి ప్రణాళిక. 20 టీఎంసీ గోదావరి నీటని తరలించి అందులో 17 టీఎంసీ జంటనగరాల తాగునీటి కోసం, మిగిలిన నీటిని మూసీలో నిరంతరం నీరు ప్రవహించేలా వినియోగిస్తాం. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం సమగ్రమైన ఒక రోడ్ మ్యాప్‌ను తయారు చేసుకున్నాం. మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లడానికి సలహాలివ్వండి. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వారిని ఎవరినీ నిరాశ్రయులను చేయం. వారికి మరిన్ని మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తాం. ఏ ఒక్కరికి నష్టం చేయం.." అని ముఖ్యమంత్రి గారు స్పష్టంగా వివరించారు.

# ట్రాఫిక్ కు చెక్ పెడతాం

**మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలతో బృహత్తర ప్రణాళికలు**

**ఒక గొడుకు కిందికి ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన**

**హైదరాబాద్ అభివృద్ధికి రోడ్ మ్యాప్**

**మెట్రో, రోడ్ల విస్తరణపై అసెంబ్లీలో సీఎం రేవంత్**

**హైదరాబాద్, మార్చి23 ( వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్ నగర జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు చేపట్టడం వంటి బృహత్తరమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంత పరిపాలన మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చి హైదరాబాద్ నగర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించామని చెప్పారు. శాసనమండలి సభ్యులు లేవనెత్తిన ఒక ప్రశ్నకు సీఎం సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా మెట్రో, రోడ్ల విస్తరణపై సమగ్రంగా వివరించారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ లక్ష్యంతో రూ. 24 వేల కోట్లతో మెట్రో రెండో దశ 76 కిలమీటర్ల మేరకు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు."మూసీ సుందరీకరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించుకోవడంతో హైదరాబాద్ ఒక అద్భుతమైన నగరంగా మారుతుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్లను 3 రకాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు తీసుకున్నట్లు వివరించారు. అండర్ పాస్, సర్వేస్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. ఉత్తర తెలంగాణ మార్గంలో అటు కరీంనగర్, ఇటు మేడ్చెల్ వైపు కంటోన్మెంట్ ప్రాంతం బాటిల్ నెక్‌గా మారిందన్న ఆయన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రక్షణ శాఖ నుంచి 153 ఎకరాలు సేకరించినట్లు చెప్పారు. రక్షణ శాఖకు భూమికి బదులుగా భూమి కేటాయించామనీ దేశంలో ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద నుంచి ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి అండర్ టన్నెల్ నిర్మాణానికి అనుమతి తీసుకున్నామన్నారు. పనులు కొనసాగుతున్నాయని వివరించారు. నల్గొండ వైపు వెళ్లే వారికి బాటిల్ నెక్‌గా మారిన నల్గొండ చౌరస్తా జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ జూన్, జూలై నాటికి అందుబాటులోకి రానుందని ప్రకటించారు.

బాటిల్ నెక్సను తొలగించి నిరంతర ప్రయాణానికి 29 ప్రాంతాల్లో అండర్ పాస్, సర్వేస్ రోడ్స్, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట చౌరస్తా తదితర ప్రాంతాల నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న సీఎం... కమాండ్ కంట్రోల్ సెంటర్ రోడ్, ఎమ్మెల్యే కాలనీ, దుర్గం చెరువు, రామానాయుడు స్టూడియో, హైకోర్టు జడ్జెస్ క్వార్టర్స్, మహాప్రస్థానం, కోహినూర్ హోటల్ నుంచి రాయదుర్గం నాలెడ్జ్ పార్క్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించి దానిని పీవీ ఎక్స్‌ప్రెస్ వేకు అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. హైదరాబాద్ మెట్రో ప్రారంభమైనప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఉండగా, గత దశాబ్దకాలం ఎలాంటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో 9వ స్థానంలోకి పడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరానికి ఎక్కడి నుంచి అయితే ట్రాఫిక్ ప్రారంభమయ్యే హయత్‌నగర్, రామచంద్రాపురం లాంటి లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ప్రాంతాలకు మెట్రో విస్తరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మెట్రో పనులను విస్తరించాలని భావించినప్పుడు ఎల్ అండ్ టీ సంస్థ ఈ వ్యాపారం నుంచి తప్పుకున్నామని ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించిందన్నారు. ఎల్బీనగర్ వద్ద మెట్రో ఆగిపోయిందనీ హైదరాబాద్‌కు ట్రాఫిక్ ప్రారంభమయ్యే హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరించాలన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ లేదు. అందుకే నాగోల్, ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్, చాంద్రాయగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రోను పొడగిస్తున్నామన్నారు. గౌలిగూడ వద్ద ఆగిపోయిన మెట్రో పనులను పునరుద్ధరించి ఫలక్‌నుమా, చాంద్రాయగుట్ట జంక్షన్‌కు కనెక్ట్ చేస్తున్నాం. లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ వరకు పొడగించాల్సి ఉందని వివరించారు. బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం నుంచి అత్యధిక ట్రాఫిక్ ఉంటుంది. చందానగర్ వరకు, నియోపోలిస్ కనెక్ట్ చేస్తూ విస్తరించాల్సి ఉందన్నారు. నగరంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో కూడా పాదచారులకు అనేక ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్ సమస్యలేర్పడుతున్నాయన్నారు. చిరు వ్యాపారులకు కొంత కష్టమైనప్పటికీ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా ఆపరేషన్ రోప్ పేరుతో ఫుట్‌పాత్‌లపై ఆక్రణలను తొలగిస్తున్నట్లు చెప్పారు. పార్కింగ్ కూడా అతిపెద్ద సమస్యగా మారిందనీ అందుకే కేబీఆర్ పార్క్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో మల్టిలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. 360 కి.మీ మేరకు విస్తరించి ఉండే రీజినల్ రింగ్ రోడ్డుకు ఓఆర్ఆర్‌కు మధ్యన రేడియల్ రోడ్లను చేపట్టినట్లు చెప్పారు.

మూసీ పునరుజ్జీవంలో భాగంగా హిమాయత్ సాగర్ జంక్షన్ నుంచి మూసీ వెంట గౌరవెల్లి వరకు గౌలిగూడ, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, నాగోల్ జంక్షన్లలో ట్రంపెట్లను ఏర్పాటు చేస్తూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని వివరించారు. ఈ కారిడార్ వల్ల హిమాయత్‌సాగర్ నుంచి గౌరవెల్లి వరకు 43 కిలో మీటర్ల మేరకు ఎలివేటెడ్ కారిడార్‌తో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. ఈ రకంగా 783 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కోర్ అర్బన్ రీజియన్ క్యూర్ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చెల్ కార్పొరేషన్స్‌ను, 4 పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు సీఎం వివరించారు.

## బియ్యం ఎగుమతి సఫలం

మొదటి పేజీ తరువాయి

ఎగుమతులతో తెలంగాణా బియ్యానికి భారీగా డిమాండ్ పెరిగి భారతదేశంలోనే అత్యధికంగా క్వింటా ఒక్కంటికి రూ.3600 ధర పలికిందని ఆయన వెల్లడించారు. భారతదేశంలోనే ఈ రకం బియ్యానికి నమోదైన ధరలలో 3,600 అత్యదిక ధర అని ఆయన వివరించారు. 2025–26లో ఓపెన్ మార్కెట్ స్కీమ్ కింద భారత ఆహార సంస్థ వేలం నిర్వహిస్తే రూ.3వేల ధర పలకలేదని ఆయన గుర్తు చేశారు. ఛత్తీస్ ఘడ్ లో క్వింటాకు రూ. 1800 నుండి రూ. 1900 వరకే ధర పలికాయాన్నారు. ఫిలిప్పీన్స్ కు తెలంగాణ నుండి బియ్యం ఎగుమతి ముమ్మాటికీ సమర్ధనియమైనదే నని ఆయన తేల్చి చెప్పారు. రాష్ట్ర రైతుల ప్రయోజనార్థమే ఇక్కడి బియ్యానికి గ్లోబల్ బ్రాండ్ గా ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుండి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తెలంగాణ నుండి 22,750 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేసిన ప్రభుత్వం చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాష్ట్ర శాసనసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బియ్యం ఎగుమతుల అంశాన్ని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్ రావు లేవనెత్తుతూ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. హరీశ్ రావు కోరుతున్నట్లు హౌస్ కమిటినే నియమిస్తే ఆయన మంత్రిగా ఉన్న ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలను పరిశీలించేందుకే పరిమితం చేయాలి అని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపట్టిన ఎగుమతుల కార్యక్రమాన్ని దృష్టి మరల్చేందుకే హరీష్ రావు ఆరోపణలకు పIనుకుంటున్నారని, వాస్తవానికి హరీశ్ రావే పౌర సరఫరాల శాఖా కమిషనర్ ను సంప్రదించి బియ్యం ఎగుమతులలో తనకు అనువైన అనుచరిడికి అవకాశం ఇవ్వాలి అంటూ వత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించారు. నిజాలు ఇలా ఉండగా సభను రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టించే విదంగా ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హరీశ్ రావు పై విరుచుకుపడ్డారు.ఫిలిప్పీన్స్ కు బియ్యం ఎగుమతుల ఒప్పందంపై ఎటువంటి అపోహలకు ఆస్కారమే లేదని ఆయన కొట్టి పారేశారు.అంతర్జాతీయ కొనుగోలు దారులతో తెలంగాణా బియ్యం ఎగుమతుల ప్రక్రియలో తెలంగాణా ప్రభుత్వం ఆయా దేశాల ప్రభుత్వ ప్రతినిధులతో మాత్రమే సంప్రదించి ఒప్పందం కుదుర్చుకుంతుందన్నారు.ఇక్కడి ప్రభుత్వం అక్కడి ప్రభుత్వ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి ఆయా దేశాల కొనుగోలు దారులతో ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు హరీష్ రావు లేవనెత్తిన అపోహలకు తావు ఉండనే ఉండదని ఆయన స్పష్టం చేశారు.ఫిలిప్పీన్స్ కు తెలంగాణా బియ్యం ఎగుమతి చెయడం విజయవంతంగా జరిగిందని తద్వారా థాయ్ లాండ్, వియత్నాం, కంబోడియా వంటి దేశాలకు చెందిన బియ్యం బ్రాండ్ల సరసన తెలంగాణా బియ్యాన్ని నిలబెట్టినట్లయిందని ఆయన వివరించారు.కేంద్ర ప్రభుత్వం తన నిర్దేశిత లక్ష్యం 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాం కొనుగోలుకు పరిమితము అయినప్పటికీ తెలంగాణా రైతుల నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదన్నారు.గడిచిన ఖరీఫ్ సీజన్ లో 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.కేంద్ర ప్రభుత్వం 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తుండగా మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

## యుద్ధ జ్వాలల్లోనూ ఇంధన భద్రత

మొదటి పేజీ తరువాయి

సరఫరా నిరాటంకంగా సాగేలా చూసేందుకు కూడా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. యుద్ధ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు చెప్పారు. అక్కడ చిక్కుకొన్న భారతీయులను సురక్షితంగా తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎల్పీజీ విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన అన్నారు. మన దేశం ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటుందని అన్నారు. అయితే, ఈ యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోందని అన్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటిమంది భారతీయులు నివసిస్తున్నారని, వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయులు పని చేస్తున్నారని, వారందరికీ అవసరమైన సాయాన్ని అందిస్తున్నామని ప్రధాని తెలిపారు. ఈ నేపథ్యంలో భారత దౌత్య కార్యాలయాలు కూడా క్రియాశీలకంగా పని చేస్తూ, సాధ్యమైనంత మేరకు భారతీయులకు తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన తర్వాత ఆ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడానని మోడీ చెప్పారు.

**యుద్ధంలో దెబ్బతిన్న దేశాలకు భారత్‌తో వాణిజ్య సంబంధాలు**

యుద్ధం వల్ల ప్రభావితమైన దేశాలతో భారతదేశానికి వాణిజ్య సంబంధాలు ఉన్నాయని, అలాగే న్యూఢిల్లీ ముడి చమురు, గ్యాస్ అవసరాలలో గణనీయమైన భాగం ఈ ప్రాంతం నుండే తీరుతోందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ప్రాంతం ముఖ్యమైనది కావడానికి మరొక కారణం , సుమారు కోటి మంది భారతీయులు అక్కడ నివసిస్తూ, పనిచేయడమేనని ఆయన వివరించారు. యుద్ధ ప్రభావిత దేశాలలో కొందరు భారతీయులు మరణించారని, అనేకమంది గాయపడ్డారని ఆయన అన్నారు. వారి కుటుంబానికి అవసరమైన తోడ్పాటును అందించడమే కాకుండా, గాయపడ్డవారికి చికిత్సను అందిస్తున్నట్టు వివరించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు.

**ఎల్‌పీజీ ఉత్పత్తి పెంపుకు చర్యలు :**

దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నామని, దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నామని ప్రధాని సభకు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లమని, ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగిందని తెలిపారు. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని, వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నామని ప్రధాని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగామని అన్నారు. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో, ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉందని ప్రధాని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటామని హామీ ఇచ్చారు. హొర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు, అంతరాయాలను ఖండిస్తూ, ఇది ఆమోదయోగ్యం కాదని ఆయన అన్నారు. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నామిని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు.



# జాతీయం-అంతర్జాతీయం



## ఇంధన సంక్షోభం నుంచి
# ఎవరూ తప్పించుకోలేరు

### ఐఇఎ అధిపతి బిరోల్



**వుదయం డెస్క్, మార్చి 23:**

మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని, దీని ప్రభావాల నుండి ఏ దేశమూ మినహాయింపు కాదని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) అధిపతి ఫాతిహ్ బిరోల్ సోమవారం అన్నారు. కొన్ని దశాబ్దాలలో ఎన్నడూ లేనంత ఇంధన సంక్షోభం ముప్పును ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటోందని ఆయన హెచ్చరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు . ఆ ప్రాంతంలో 40కి పైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసమయ్యాయని మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. దాంతో ఇంధన సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

1970ల్లో చోటు చేసుకున్న, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు చవిచూసిన చమురు, గ్యాస్ సంక్షోభాలను మించిన పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఇంధన మౌలిక సదుపాయాలు దెబ్బతింటే, ఆ ప్రభావం అంతర్జాతీయ మార్కెట్ల పైనా తీవ్రంగా ఉంటుందని, దానితో అది ధరల్లో అస్థిరత, సరఫరా కొరతకు దారితీస్తుంది అని హెచ్చరించారు. ఇప్పటికే పలు ఆర్థికవ్యవస్థలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మందగిస్తోన్న వృద్ధితో సతమతమవుతున్న తరుణంలో ఆయన హెచ్చరికలు చేయడం గమనార్హం.

కాగా, యుద్ధం నాలుగవ వారంలోకి ప్రవేశించడం యుఎస్ అధ్యక్షుడు ట్రంప్, తెహ్రాన్ ఒకరినొకరు హెచ్చరించుకోవడం మనం గమనిస్తున్న విషయమే.

ప్రపంచ చమురు వాణిజ్యంలో అతిపెద్ద సంక్షోభంగా 1973ని వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా వ్యవహరించిన అమెరికా, నెదర్లాండ్స్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా, తదితర దేశాలపై ఒపెక్ దేశాలు చమురు ఆంక్షలు విధించాయి. దీంతో పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడి.. అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. 1970ల్లోనే ఇస్లామిక్ విప్లవం వల్ల మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఐరోపాకు గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగింది. వీటిని ఐఈఏ చీఫ్ ప్రస్తుత సంక్షోభంతో పోల్చారు. ప్రస్తుత పరిస్థితులు ఈ ఆయిల్, గ్యాస్ షాక్‌లన్నింటిని మిళితం చేసి.. ప్రపంచ ఆర్థికవ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నాయన్నారు. ఈ అనిశ్చితి నుంచి బయటకు వచ్చేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు అత్యవసరమని ప్రపంచ దేశాలకు సూచించారు.



## ఇరాన్‌లోని బాధితులకు
# కశ్మీరీల సాయం

**న్యూఢిల్లీ, మార్చి 23 (వుదయం**

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో కశ్మీరీలు, ముఖ్యంగా బారాముల్లా, బుద్గామ్ వంటి షియా ఆధిపత్య ప్రాంతాలలో, ఇరాన్‌లోని బాధితులకు మానవతా సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు.

కాశ్మీరీలు స్వచ్ఛంద సేవకులుగా మారి, సహాయం నిమిత్తం ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. స్థానికులు కేవలం డబ్బునే కాకుండా, బంగారం, వెండి, పశుసంపద, సంప్రదాయ రాగి వస్తువులను కూడా విరాళంగా ఇచ్చారు. తమ మానవతా సహాయం, హృదయపూర్వక సంఘీభావంతో ఇరాన్ ప్రజలకు అండగా నిలిచిన కాశ్మీర్ ప్రజలకు మేము కృతజ్ఞతాపూర్వక హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం; ఈ కరుణను ఎన్నటికీ మరచిపోలేము. భారతదేశానికి ధన్యవాదాలు,"అని రాయబార కార్యాలయం ఎక్స్ పై పోస్టు చేసింది.

ఈ ప్రచారంలో పురుషులు, మహిళలు, పిల్లలు, సమాజంలోని ప్రతి వర్గం పాల్గొన్నారు. ఒక కాశ్మీరీ వితంతువు తన దివంగత భర్త జ్ఞాపకార్థం 28 ఏళ్లుగా దాచుకున్న బంగారు జ్ఞాపికను విరాళంగా ఇచ్చారు.ఆ మహిళ చేసిన ఈ పనిని ఇరాన్ రాయబార కార్యాలయం ప్రశంసించింది. సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా ఆమెకు ధన్యవాదాలు తెలిపింది. కాశ్మీర్‌కు చెందిన ఒక గౌరవనీయ సోదరి, 28 ఏళ్ల క్రితం మరణించిన తన భర్త జ్ఞాపకార్థం దాచుకున్న బంగారాన్ని, ఇరాన్ ప్రజల పట్ల ప్రేమ, సంఘీభావంతో నిండిన హృదయంతో విరాళంగా ఇచ్చారు. మీ కన్నీళ్లు , స్వచ్ఛమైన భావోద్వేగాలు ఇరాన్ ప్రజలకు గొప్ప ఓదార్పునిస్తాయి.వాటిని ఎన్నటికీ మరవం, అని ఇరాన్ రాయబార కార్యాలయం పోస్ట్ పేర్కొంది.పిల్లలు కూడా తమ కిడ్డీ బ్యాంకులను, ఈద్ డబ్బును విరాళంగా ఇచ్చి ఈ ప్రచారంలో చేరారు. మరికొందరు ఇరాన్‌కు మద్దతుగా తమ వంతు సహాయంగా పశువులను విరాళంగా ఇచ్చారు. బుద్గాం ఎమ్మెల్యే ముంతాజిర్ మెహదీ తన ఒక నెల జీతాన్ని ఇస్తానని ప్రతిజ్ఞ చేశారు.భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం బ్యాంకు ఖాతా వివరాలను పంచుకున్న తర్వాత, గత వారం నుండి విరాళాలు వెల్లువెత్తుతున్నాయని అధికారులు ధృవీకరించారు.

## భారత్ దిశగా ఎల్‌పిజితో
# మరో రెండు నౌకలు

**న్యూఢిల్లీ, మార్చి 23 (వుదయం)**: పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ, భారత జెండా కలిగిన రెండు నౌకలు వంటగ్యాస్‌ను మోసుకొస్తూ ప్రస్తుతం హొర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్నాయి. ఈ పరిణామం భారత్‌లో ఎల్‌పిజి కొరత తగ్గుతుందనే ఆశలను రేకెత్తిస్తోంది.




సురక్షిత ప్రయాణానికి అనుమతి పొందిన తర్వాత, జగ్ వసంత్, పైన్ గ్యాస్ అన్న నౌకలు వ్యూహాత్మకంగా ముఖ్యమైన హొర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్నాయని నౌకా గమన డేటా వెల్లడిస్తోంది.

ఈ నౌకలు ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి)ను తీసుకుని బయలుదేరాయి. దీనిని భారతదేశంలో వంట ఇంధనంగా విస్తృతంగా ఉపయోగిస్తారు.

ఈ రెండు నౌకలు సోమవారం తెల్లవారుజామున తమ ప్రయాణాన్ని ప్రారంభించాయి. ఇవి యుఎఇ తీరం నుండి బయలుదేరి, ఖేష్మ్, లారాక్ దీవుల సమీపంలో ఇరాన్ తీరప్రాంతానికి దగ్గరగా ప్రయాణిస్తున్నాయి.

ఏదైనా నిర్దిష్ట గమ్యస్థానాన్ని చూపించడానికి బదులుగా, ఆ నౌకలు తమ ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా భారతీయ యాజమాన్యాన్ని సూచించాయి. ఈ సున్నితమైన మార్గంలో ప్రయాణించే అనేక నౌకలు తీసుకునే ఒక ముందు జాగ్రత్త చర్య ఇది.

నివేదికల ప్రకారం, వారి ప్రయాణం ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగితే, నౌకలు సోమవారం సాయంత్రానికల్లా ఒమన్ గల్ఫ్‌కు చేరుకుంటాయని భావిస్తున్నారు.

నివేదికల ప్రకారం, హొర్ముజ్ జలసంధి గుండా పూర్తి ప్రయాణానికి సాధారణంగా సుమారు 14 గంటల సమయం పడుతుంది.

ఫిబ్రవరి చివరిలో ఈ ప్రాంతంలో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల అనంతరం పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా, చమురు, గ్యాస్ రవాణాకు కీలక మార్గమైన ఈ జలసంధి తీవ్రంగా ప్రభావితమైన తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

అప్పటి నుంచి, ఇరాన్ ఈ జలమార్గం గుండా రాకపోకలను చాలా వరకు నియంత్రించింది. చర్చల అనంతరం, భారతదేశంతో సహా కొన్ని దేశాలకు చెందిన ఎంపిక చేసిన నౌకలను మాత్రమే వెళ్ళడానికి అనుమతిస్తోంది. నౌకా రవాణా సరళిని బట్టి చూస్తే, ఇరాన్ తన తీరప్రాంతం వెంట నౌకలను మళ్లించడం ద్వారా రవాణాను నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది.

దీనికి విరుద్ధంగా, ఒమన్‌కు దగ్గరగా ఉన్న సాధారణ మార్గంలో ప్రమాదాలు తలెత్తాయి. ఈ నెల ప్రారంభంలో కనీసం ఒక నౌకపై దాడి జరిగినట్లు సమాచారం.

సంఘర్షణ తీవ్రరూపం దాల్చడానికి కొద్ది రోజుల ముందు, ఫిబ్రవరి చివరిలో జగ్ వసంత్స, పైన్ గ్యాస్ రెండూ పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించాయి.

జగ్ వసంత్ కువైట్ నుంచి ఎల్‌పిజిని లోడ్ చేసుకోగా, పైన్ గ్యాస్ యుఎఇలోని రువైస్ నుండి తన సరుకును తీసుకుంది.

ఉద్రిక్తతల కారణంగా ఆ ప్రాంతంలోనే చిక్కుకుపోయిన వారికి, ఇప్పుడు ముందుకు సాగడానికి అనుమతి లభించింది.

ఈ నెల ఆరంభంలో, భారత జెండా కలిగిన మరో రెండు ఎల్‌పిజి రవాణా నౌకలు ఇదే జలసంధి గుండా ఇటువంటి ప్రయాణాలనే విజయవంతంగా పూర్తి చేశాయి.

## తమిళనాడులో
# ఎన్డీయే కూటమి సీట్ల సర్దుబాటు ఫైనల్

**చెన్నై, మార్చి 23 (వుదయం)**:



త్వరలో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీయే పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారు అయింది. మొత్తం 234 స్థానాలలో బిజెపి 27 స్థానాలలో పోటీ చేయనుండగా, మిగిలిన 178 స్థానాలలో ఎఐఎడీఎంకె పోటీ చేయనుంది. కూటమిలో గల పట్టలి మక్కల్ కట్చి (పీఎంకే)కి 18, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కు 11 స్థానాలు కేటాయించింది. బిజెపి నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పీఎంకే అగ్రనేత అన్బుమణి రామ్‌దాస్, ఏఎంఎంకే అధిపతి టీటీవీ దినకరన్ తదితరుల సమక్షంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పడి పళనిసామి సీట్ల పంపకాల వివరాలు ప్రకటించారు. గత ఎన్నికలతో పోలిస్తే బిజెపి ఈసారి అదనంగా ఏడు స్థానాల్లో పోటీ చేయనుంది.

మరోవైపు అధికార డీఎంకే, కాంగ్రెస్‌కు 28 సీట్లను కేటాయిస్తూ ఇప్పటికే ఒప్పందాన్ని ఖరారు చేసింది. 2021తో పోలిస్తే మూడు సీట్లు ఎక్కువగా కేటాయించింది. సీపీఐకి ఐదు, ఎండీఎంకేకు నాలుగు, కేఎండీకే, ఐయూఎంఎల్, ఎంఎంకేలకు రెండు సీట్ల చొప్పున ఇచ్చింది. సీపీఎం, డీఎండీకే, వీసీకే తదితర పార్టీలతో సర్దుబాటు ఖరారు చేసుకునే అవకాశం ఉంది.మే 10తో రాష్ట్ర అసెంబ్లీ కాలపరిమితి ముగియనుండడంతో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. మే 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## ఎయిర్ కెనడా విమానప్రమాదంలో
# 2 పైలెట్ల మృతి




**వుదయం డెస్క్, మార్చి 23:**

అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న లాగార్డియా విమానాశ్రయంలో, ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ విమానం భూమిపై ఉన్న ఒక వాహనాన్ని ఢీకొట్టిందని విమాన రాడార్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్ 24 తెలిపింది.

విమాన పైలట్, సహ-పైలట్ తీవ్ర గాయాల కారణంగా మరణించగా, ఒక సార్జెంట్, మరొక అధికారికి ఎముకలు విరిగినప్పటికీ, వారి పరిస్థితి నిలకడగా ఉందని ఎన్‌సిబి ఛానెల్ పేర్కొంది.

ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారని, ఇందులో ప్రమేయం ఉన్న అగ్నిమాపక వాహనాన్ని పోలీసు సిబ్బంది నడుపుతున్నారని ఆ నివేదిక పేర్కొంది.మాంట్రియల్ నుండి వచ్చిన 'ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సిఆర్‌జె-900' విమానం, విమానాశ్రయంలోని 'రన్‌వే 4' పై ల్యాండ్ అవుతున్న సమయంలో, గంటకు సుమారు 24 మైళ్ల వేగంతో ఒక అగ్నిమాపక వాహనాన్ని ఢీకొట్టింది. ఆ విమానంలో 72 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు.

ఈ ప్రమాదంలో చిక్కుకున్న విమానాన్ని, కోరస్ ఏవియేషన్ యాజమాన్యంలోని ఎయిర్ కెనడా ప్రాంతీయ భాగస్వామి అయిన జాజ్ సంస్థ నడుపుతోంది.నియంత్రణ సంస్థ జారీ చేసిన ఒక ప్రకటన ప్రకారం, యుఎస్‌ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆ విమానాశ్రయంలోని అన్ని విమానాల రాకపోకలను 05:30 జిఎంటి వరకు నిలిపివేసింది.

ఆదివారం రాత్రి సుమారు 11:40 గంటల సమయంలో, లాగార్డియా విమానాశ్రయంలోని రన్‌వే 4 పై, ఎయిర్ కెనడా తరపున నిర్వహిస్తున్న జాజ్ ఏవియేషన్ విమానం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో, వేరొక ప్రమాదానికి స్పందించి వెళ్తున్న 'పోర్ట్ అథారిటీ విమాన రక్షణ, అగ్నిమాపక వాహనాన్ని' ఆ విమానం ఢీకొట్టింది, అని పోర్ట్ అథారిటీ ఆఫ్ న్యూయార్క్, న్యూజెర్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

విమానాశ్రయంలో విమాన కార్యకలాపాల నిలిపివేతకు గల కారణం ఒక అత్యవసర పరిస్థితి అని, ఈ నిలిపివేత పొడిగించేందుకు అవకాశం ఎక్కువగా ఉందని ఎఫ్ఎఎ నోటీసు పేర్కొంది. అయితే, దీనికి సంబంధించిన ఎటువంటి వివరాలను ఆ నోటీసులో స్పష్టంగా పేర్కొనలేదని రాయిటర్స్ తెలిపింది.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న, ఇంకా ధృవీకృతం కాని దృశ్యాలలో విమానం ముందు భాగం దెబ్బతిని ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రయాణికులు విమానం దిగిన తర్వాత, ఆ విమానం ముందు భాగం పైకి లేచిందని ఆ వీడియోలోని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పడం వినిపించింది. అయితే, ఈ దృశ్యాల ప్రామాణికతను వెంటనే ధృవీకరించలేదు.ప్రమాదంపై దర్యాప్తు జరుగుతున్నందున విమానాశ్రయ రన్‌వేను మూసివేశారని, పోర్ట్ అథారిటీ పోలీస్ విభాగం, ఆ ఏజెన్సీ ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంఘటనా స్థలంలో ఉన్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నట్లు ఏపీ వార్తా సంస్థ తెలిపింది.

## 24వ రోజు
# యుద్ధ పరిణామాలు

**వుదయం డెస్క్, మార్చి 23:**



యుఎస్- ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులకు ప్రతీకారంగా ఇరాన్ హొర్ముజ్ జలసంధిని మూసివేయడం ఇప్పటికే ప్రపంచ చమురు సరఫరాకు ఆటంకం కలిగించి, అధిక ద్రవ్యోల్బణం గురించి ప్రభుత్వాలలో భయాలను పెంచింది. యుద్ధం ప్రారంభమై మూడు వారాలు దాటినా ఎవరూ వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా కనిపించడం లేదు. దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతూనే ఉంది. ఇందుకు అదనంగా హెచ్చరికలు, ప్రతి హెచ్చరికలు చేసుకుంటున్నారు.

ఐఆర్‌జిసి హెచ్చరిక: ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలను అమెరికా లక్ష్యంగా చేసుకుంటే, హొర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) పేర్కొంది. అమెరికా స్థావరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న పశ్చిమ ఆసియా విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తామని కూడా వారు హెచ్చరించారు.

ఇరాన్ మారిటైమ్ ప్రకటన: జలసంధి మూసివేయలేదని, అయితే అమెరికా ప్రారంభించిన యుద్ధం కారణంగా ఏర్పడిన బీమా ఆందోళనల వల్ల నౌకలు వెనుకాడుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అన్నారు. వాణిజ్య స్వేచ్ఛ లేకుండా నౌకాయాన స్వేచ్ఛ ఉండదు. రెండింటినీ గౌరవించండి, లేకపోతే దేనినీ ఆశించలేరు అని ఆయన అన్నారు.

ఖాసిమియా వంతెనపై ఇజ్రాయెల్ బాంబు దాడి: దక్షిణ లెబనాన్‌లోని ఖాసిమియా వంతెనను ఇజ్రాయెల్ దళాలు పేల్చివేశాయి. ఈ దాడి భూతల దండయాత్రకు నాంది అని అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ అన్నారు.

అమెరికా హెచ్చరికలు: జలసంధిని తిరిగి తెరవమని లేదా వారి విద్యుత్ కేంద్రాలను నాశనం చేస్తామని ఇరాన్‌కు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 48 గంటల గడువు ఇచ్చారు.

క్షిపణి, వైమానిక దాడులు: రాత్రికి రాత్రే ఇజ్రాయెల్ తెహ్రాన్‌పై వైమానిక దాడులు జరిపింది; ఇరాన్ క్షిపణులతో ప్రతీకారం తీర్చుకుంది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఒక అణు కేంద్రం సమీపంలో సుమారు 200 మంది గాయపడ్డారు. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు ఆదివారం ఉదయం కూడా కొనసాగాయి.

ఇరాన్ నాయకత్వం: బెదిరింపులు, భయపెట్టడం మాత్రమే మన ఐక్యతను బలపరుస్తాయి అని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. ఇరాన్ భూభాగాన్ని ఉల్లంఘించేవారికి తప్ప, మిగతా అందరికీ ఈ జలసంధి తెరిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

మానవ నష్టం: లెబనాన్‌లో 118 మంది పిల్లలు, 79 మంది మహిళలతో సహా 1,029 మంది మరణించగా, కనీసం 2,786 మంది గాయపడ్డారు. ఇరాన్‌లో మృతుల సంఖ్య 1500 దాటింది.



### సిలెండర్ల బరువు తగ్గదు
### పెట్రోలియం శాఖ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మార్చి 23:**

పశ్చిమాసియాలో యుద్ధ నేపథ్యంలో దేశంలో ఎల్‌పిజి సంక్షోభం నెలకొంటుందని, దానిని నివారించేందుకు ఎల్‌పిజి సిలండర్ బరువును 14.2 కిలోల నుంచి 10 తగ్గిస్తున్నారంటూ వచ్చిన ఊహాగానాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అందులో వాస్తవాలు లేవని తోసిపుచ్చింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ ఈ మేరకు వివరణ ఇచ్చారు.

వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు చమురు సంస్థలు సిలిండర్ బరువును తగ్గించే యోచనలో ఉన్నట్టు, ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. ముఖ్యంగా గృహ అవసరాలకు 10 కిలోలు సరఫరా చేయాలని యోచిస్తున్నట్టు పేర్కొన్నాయి.ప్రస్తుతం గృహ అవసరాల కోసం 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. దీనిని 10 కిలోలకు తగ్గించాలని, పాత సిలిండర్లలోనే 10 కేజీల ఎల్‌పీజీని నింపి అందించే అవకాశాలను పరిశ్రమ వర్గాలు పరిశీలిస్తున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి.

గృహ అవసరాలకు సిలిండర్ల కొరత రాకుండా చూసేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేయాలని ఇంధన కంపెనీలు యోచిస్తున్నాయంటూ జాతీయ మీడియాలో సవివరమైన వార్తలు వచ్చాయి. సాధారణంగా 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌ను సగటున ఒక కుటుంబానికి 35-40 రోజులు వస్తుంది. అదే 10 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ అయితే దాదాపు నెల రోజులు వస్తుందని అంచనా. సంక్షోభ పరిస్థితుల్లో పంపిణీ అందరికీ చేరేలా ఈ మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా వార్తలు రాగా, అలాంటిదేమీ లేదని తాజాగా కేంద్రం స్పష్టీకరణ ఇచ్చింది.

## దిల్లీ పేలుడు కేసు
# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌ఐఏ ముమ్మర సోదాలు




**శ్రీనగర్:**

దిల్లీ పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ జమ్మూకశ్మీర్‌లో సోదాలు నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి తనిఖీలు చేపట్టింది. హంద్వారాలోని ఓ వ్యాపారి నివాసంలో ఎన్‌ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో అరెస్టైన వైద్యులకు.. ఆయుధాలు సరఫరా చేసిన వ్యక్తులతో అతడికి సంబంధం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే పలు కీలక పత్రాలతో పాటు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈనెల మొదట్లో పుల్వామా, కుల్గాం, శోపియాన్, బారాముల్లా, కుప్వాడా జిల్లాల్లో సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కాగా ఇరాన్ మాజీ సుప్రీం ఖమేనీ మృతికి వ్యతిరేకంగా జమ్మూకశ్మీర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతుండడంతో దర్యాప్తునకు ఆటంకం కలిగిందన్నారు. దిల్లీ పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబీకి ఆయుధాలు సరఫరా చేసిన మరో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. వీరు స్లీపర్ సెల్స్‌గా ఉంటూ.. ఉగ్ర సంస్థలకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలిపారు. వీరి అరెస్టుతో ఈ కేసులో మొత్తం అరెస్టు అయినవారి సంఖ్య 11కి చేరిందన్నారు.

# మానవతా దృక్పథంతో తక్షణమే యుద్ధం ఆపాలి

### మానవతా దృష్టితో తక్షణ కాల్పుల విరమణకు ప్రపంచ నేతలకు పిలుపునిచ్చిన పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మరియు మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలనిదేశంలోని పబ్లిక్ రిలేషన్స్ వర్గాలు ప్రపంచ నాయకులకు అత్యవసర విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ సంబంధిత దేశాల నేతలను ఉద్దేశించి పిలుపునిచ్చారు.యుద్ధాగ్ని చెలరేగినప్పటి నుంచి అది మరింత విస్తరిస్తూ, ప్రపంచమంతా అసహాయంగా చూస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యుద్ధం మానవజీవితాలపై, గ్లోబల్ వనరులపై, అంతర్జాతీయ సంబంధాలపై తీవ్ర ప్రభా చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.భారతీయ సాంప్రదాయ తత్వం "వసుధైవ కుటుంబకం" స్ఫూర్తితో ప్రపంచమంతా ఒక కుటుంబమని గుర్తుంచుకొని, మానవతా దృష్టితో తక్షణ కాల్పుల విరమణ చేపట్టాలని డాక్టర్ అజిత్ పాఠక్ విజ్ఞప్తి చేశారు.66 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రొఫెషనల్ సంస్థ తరపున ఆయన ప్రపంచానికి ఎదురవుతున్న తీవ్రమైన నష్టాలను వివరించా.మానవ ప్రాణాల అపూర్వ నష్టంప్రతి రోజూ అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. భావితరాలు మానసిక వేదనను ఎదుర్కొంటు



న్నాయి. ఈ మానవ నష్టం అసహ్యకరం.ముఖ్య వనరుల క్షీణత మౌలిక సదుపాయాల నిర్మాణానికి సంవత్సరాల శ్రమ, సంపద అవసరం. కానీ యుద్ధం క్షణాల్లో వాటిని ధ్వంసం చేస్తోంది. ముఖ్యంగా పెట్రోలియం వంటి కీలక వనరులు వేగంగా తరిగిపోతున్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది.పర్యావరణానికి తిరిగి సరి చేయలేని నష్టం గాలి, నీరు, నేల కాలుష్యంతో భవిష్యత్ జీవనానికి ప్రమాదం ఏర్పడుతోంది. మన కోసం కాకపోయినా, రాబోయే తరాల కోసం అయినా దీనిని ఆలోచించాల్సిన అవసరం ఉంది.దేశాల మధ్య నమ్మకం దెబ్బతినడం: ఈ యుద్ధం దేశాల మధ్య ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తూ, శాంతి చర్చలకు ఆటంకం కలిగిస్తోంది. పరస్పర ఆధారిత ప్రపంచం ప్రస్తుత గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ పరస్పర సహకారంపై ఆధారపడుతోంది. దేశాల మధ్య సామరస్యం ఉంటేనే అభివృద్ధి సాధ్యం. ప్రపంచం మొత్తం అభివృద్ధి చెందాలి, ప్రతి ముఖంలో చిరునవ్వు మెరవాలి.సుస్థిర పరిష్కారం కోసం సంభాషణలు, దౌత్యం మాత్రమే మార్గమని పబ్లిక్ రిలేషన్స్ వర్గాలు విశ్వసిస్తున్నాయి. కాబట్టి ఈ యుద్ధాన్ని తక్షణ కాల్పుల విరమణతో పాటు, సమస్యల మూల కారణాలను పరిష్కరించే చర్చలు ప్రారంచాలని వారు కోరారు.పబ్లిక్ రిలేషన్స్ వృత్తి దేశాలు, సంస్థలు, ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కమ్యూనికేషన్ శక్తితో అవగాహన, స్నేహభావం పెంచవచ్చని తెలిపారు.

ప్రపంచ నాయకుల మధ్య పారదర్శక, నిజాయితీతో కూడిన చర్చలకు వేదిక కల్పించాలని పీఆర్‌ఎస్‌ఐ ఆకాంక్షించింది.

శాంతియుత ప్రపంచం కోసం ప్రతి స్వరం వినిపించాలని పిలుపునిచ్చింది.



“ కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలి వైపునకు తరలించి, ఇక్కడి పారిశ్రామిక జోన్‌లో ఉన్న భూములను మల్టీయూజ్ జోన్‌లోకి మార్చుతున్నామే, తప్ప యాజమాన్యపు హక్కులు మారవు. మల్టీయూజ్ జోన్‌లోకి మార్చడం వల్ల మధ్య తరగతి నివాస ప్రాంతాలుగా మారుతాయి. పరిశ్రమలను తరలించడం ద్వారా నగరం కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందన్నది మొట్టమొదటి ప్రణాళిక. 20 టీఎంసీ గోదావరి నీటిని తరలించి అందులో 17 టీఎంసీ జంటనగరాల తాగునీటి కోసం, మిగిలిన నీటిని మూసీలో నిరంతరం నీరు ప్రవహించేలా వినియోగిస్తాం. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి కోసం సమగ్రమైన ఒక రోడ్ మ్యాప్‌ను తయారు చేసుకున్నాం. మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లడానికి సలహాలివ్వండి. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారిని ఎవరినీ నిరాశ్రయులను చేయం. వారికి మరిన్ని మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తాం. ఏ ఒక్కరికీ నష్టం చేయం. ”

* శాసన మండలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## వే'మన'పద్యం

**మేడిపండు చూడ మేలిమై యుండును**
**పొట్టవిప్పి చూడ పురుగులుండు**
**పిరికివాని మదిని బింకమీలాగురా**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# యుద్ధ విరామం

యుద్ధ పర్యవసానాలతో ప్రపంచం అతలా కుతలమైపోయి దేశదేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినిపోతున్నాయి. ఈ దశలో అమెరికా అధ్యక్షుడు సోమవారం నాడు చేసిన ఒక ప్రకటన ఊరటనిస్తున్నది. ఇంతకుముందు తాము చెప్పినట్టు ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేయబోవడం లేదని ట్రంప్ ప్రకటించారు. ఐదు రోజులపాటు దాడులను ఆపుతున్నట్టు వెల్లడించారు.. ఇరాన్ తో చర్చలు ఫలప్రదమయ్యే దిశగా సాగుతున్నందున ఈ విరామాన్ని ప్రకటిస్తున్నట్టు ఆయన వివరించారు.అయితే ఇరాన్ ఈ విషయాన్ని ధ్రువపరచలేదు.అమెరికాతో తాము ఎటువంటి చర్చలు జరపడం లేదని అది ప్రకటించింది. తమ హెచ్చరికలకు భయపడి అమెరికాయే దిగివచ్చిందని, ట్రంప్ ఇలా చేయడం ఇది రెండోసారి అని ఇరాన్ తెలిపింది.ప్రస్తుతానికి అస్పష్టత, గందరగోళం ఉన్నప్పటికీ అమెరికా వ్యూహంలో మార్పు కనిపిస్తున్నది. ట్రంప్ యుద్ధ విరామ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర తగ్గింది.ట్రంప్ ప్రకటన ఏకపక్షమైనదే అని ప్రస్తుతానికి అనుకోకతప్పడం లేదు. ఆ మేరకు యుద్ధవిరామాన్ని అమెరికా ఒక్కటే పాటించినా మేలే జరుగుతుంది.కాని ట్రంప్ ను నమ్మగలమా?ఈ యుద్ధం ప్రారంభంలోనూ ఇరాన్ తో చర్చలు జరుపుతూనే అర్ధంతరంగా దాని మీదకు దాడికి వెళ్లారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని కుటుంబంతో సహా హతమార్చారు. 165 మంది బడి బాలికలను బలి తీసుకున్నారు.ఇప్పుడు సైతం ట్రంప్ అటువంటి మోసకారి మార్గాన్నే ఎంచుకుని ఉంటాడా ?విరామం మాటున మళ్ళీ కూడగట్టుకొని తిరిగి దాడులకు సమకడతాడా ? విశ్వసనీయత కోల్పోయిన నాయకుల మాటలకు విలువ ఉండదు. అదేమైనప్పటికీ యుద్ధం నెల రోజులపాటు జరిగిన తర్వాత తామే ఖచ్చితమైన విజేతలమని చెప్పుకునే స్థితిలో రెండు పక్షాలు కూడా లేవు. ఇరాన్ ను సైనికంగా అణచివేసి దాని నోరు మూయించడం, అక్కడ మత ప్రభుత్వాన్ని కూలదోసి తమ కీలుబొమ్మ పాలనను నెలకొల్పి దాని వనరులను కాజేయడం తాము అనుకున్నంత సునా యాసం కాదని అమెరి కా, ఇజ్రాయెల్ లకు తెలిసి వచ్చి ఉండాలి.యుద్ధంలో ఇరానే ఎక్కువగా నష్టపోయింది. కాని అమెరికాను,ఇజ్రాయెల్ ను అదేమీ తక్కువ దెబ్బ తీయలేదు. అతి చౌకగా తయారు చేసిన శక్తిమంతమైన డ్రోన్ ల తో అమెరికా, ఇజ్రాయెల్ లను ఇరుగు, పొరుగు గల్ఫ్ దేశాలను గడగడలాడించింది.హోర్ముజ్ జలసంధిని ఇరాన్ అత్యంత ప్రభావవంతంగా వాడుకున్నది. గల్ఫ్ లో గల అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరపడం ఇరాన్ కు కలిసివచ్చింది.యుద్ధం కొనసాగడం ఇరాన్ కు లాభించింది. గల్ఫ్ దేశాలకు అమెరికా సమకూర్చిన ఆయుధ నిల్వలు అడుగంటిపోయాయి. అత్యంత ఖరీదైన ఆయుధాలు వృధా కావడం అమెరికా ఖజానాను దెబ్బతీసింది. యుద్ధానికి ఇతోధిక ఆర్థిక సాయాన్ని ట్రంప్ కోరవలసి వచ్చింది. యుద్ధ విరామం విషయంలో అమెరి కాతో ఇజ్రాయెల్ విబేధించినట్టు వార్తలు చెబుతున్నా యి. యుద్ధం కొనసాగించేలా అమెరికా పై ఒత్తిడి ఇస్తానని ఇజ్రాయెల్ ప్రకంచినట్టు వార్తలు చెబుతున్నాయి. సముద్రంలో గల ఇరాన్ నౌకల్లోని చమురుపై ట్రంప్ ఆంక్షలు తొలగించినప్పుడే ఆయన యుద్ధ విరమణవైపు అడుగులు వేస్తున్నట్టు సూచనలు వెలువడ్డాయి. ఇప్పటికైతే స్పష్టత కొరవడి నప్పటికీ త్వరలోనే యుద్ధం ముగింపుకి రాగలదనే ఆశలు కలుగుతున్నాయి. ఇజ్రాయెల్ మాట విని ఎంతటి అపరాధానికి పాల్పడ్డాడో ట్రంప్ తెలుసుకుంటే మంచిది.



**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# భగత్ సింగ్ ఆలోచన స్వేచ్ఛ

ఆయన పేరు పలికితేనే రోమాలు నిక్కబొడుస్తాయి... ఆ త్యాగగాథ తలచుకుంటే రక్తం రగిలిపోతుంది. తెల్లదొరల పాలనను అంతం చేయడానికి అగ్నిజ్వాలలా మారిన వ్యక్తి అతడు. “స్వాతంత్ర్యం నా జన్మహక్కు” అని నినదించిన వ్యక్తి అతడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదిరించి నిలిచిన యోధుడు అతడు. భవిష్యత్‌కు బలమైన బీజం వేయాలని తపనతో పార్లమెంటుపై బాంబు విసిరిన విప్లవ వీరుడు అతడు. విప్లవం ద్వారానే విజయం సాధ్యమని నమ్మిన మహోన్నత ఘనుడు అతడు — ఆయనే భగత్ సింగ్. ఇది కేవలం ఓ వ్యక్తి కాదు; దేశ చైతన్యాన్ని మేల్కొలిపే

*భగత్ సింగ్ కలలుగన్నది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కాదు; లౌకికత, సమానత్వం, సోషలిజం ఆధారంగా సమసమాజ నిర్మాణం. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ, భూస్వామ్య కట్టుబాట్లు, కుల-మత వివక్షలపై ఆయన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆయన పేరు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలకు ప్రేరణగా నిలుస్తోంది. నేటి పరిస్థితుల్లో సమాజం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. మతం, కులం పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే శక్తులు బలపడుతున్నాయి. విద్య, వైద్య రంగాలు పేదలకు అందని ద్రాక్షగా మారుతున్నాయి. నిరుద్యోగం పెరుగుతోంది. ప్రపంచ రాజకీయ పరిణామాలు, యుద్ధాలు సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి.*

మహత్తర శక్తి, శాశ్వత స్ఫూర్తి. "నేను ప్రేమించినా.. పెళ్లాడినా అది నా మాతృభూమినే! నా ధ్యాస, నా శ్వాస, నా సర్వస్వం నా దేశం. ఈ గడ్డపై పుట్టినా,ఈ మట్టిలో కలిసిపోయినా అది నా దేశ విముక్తి కోసమే కావాలి."“నన్ను చంపగలరు, నా ఆశయాలను కాదు” అన్న ఆయన ఉక్కు నినాదం, ఉరికొయ్యపై చిరునవ్వుతో నిలిచిన అతని అపార ధైర్యం.. ఇవి చరిత్ర పుటల్లో నిలిచిన శాశ్వత జ్యోతులు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారు ఎల్లకాలం జీవిస్తారనే సత్యానికి భగత్ సింగ్ చిరస్మరణీయ నిదర్శనం. "నన్ను మీరు చంపగలరేమో కానీ.. నా ఆశయాన్ని చంపలేరు. నా దేహం నుంచి చిందే ప్రతి రక్తపు చుక్క ఏరులై ప్రవహించి, ఈ దేశ మట్టిని తడపాలి. ఆ రక్తపు వాసన ప్రతి భారతీయుడిలో స్వదేశీ చైతన్యమై వికసించాలి. ఆ చైతన్యం తెల్లదొరల పాలనకు చరమగీతం పాడాలి. 1907 సెప్టెంబర్ 28న నేటి పాకిస్తాన్‌లోని లాయల్పూర్ జిల్లా బంగాలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు భగత్ సింగ్ జన్మించాడు. చిన్ననాటి నుంచే దేశభక్తి అతని నరనరాల్లో నింపుకుంది. 12 ఏళ్ల వయసులోనే జలియన్‌వాలాబాగ్ దారుణాలను చూసి రగిలిపోయాడు. 14 ఏళ్లకే స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టాడు. మహాత్మా గాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ, ఆ ఉద్యమాన్ని నిలిపివేయడాన్ని సమర్థించలేదు. స్వాతంత్ర్యం యాచిస్తే రాదని, పోరాడితేనే సాధ్యమని గ్రహించాడు. కుటుంబ సభ్యులు పెళ్లి చేసేందుకు ప్రయత్నించగా, “నా జీవితాన్ని మాతృదేశ విముక్తి అనే ఉన్నతాశయానికి అంకితం చేశాను. కుటుంబ సుఖాల పట్ల నాకు మోజు లేదు” అంటూ తండ్రికి ఉత్తరం రాసి ఇంటిని విడిచాడు. అనంతరం నవజవాన్ భారత్ సభలో చేరి యువతను చైతన్యపరిచాడు. తర్వాత హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో చేరి సుఖ్‌దేవ్, రాజ్‌గురులతో కలిసి విప్లవ కార్యకలాపాలను కొనసాగించాడు. నేను తుపాకి మొక్కలు నాటుతున్నాను నాన్నా! ఇవి పెరిగి పెద్దవై వేల తుపాకులుగా వికసించాలి. ఆ ఆయుధాలను నా దేశ ప్రజలకు పంచి, ఈ తెల్లదొరల గుండెల్లో నిద్రపోతా.



సమాజ నిర్మాణం కోసం పోరాడాలి. ప్రజా సమస్యలపై చైతన్యంతో నిలబడి ఉద్యమాలను బలోపేతం చేయాలి. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ కలలు కన్న సమాజం కోసం పోరాడినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించిన వారమవుతాం. వారి త్యాగం చరిత్రలో మాత్రమే కాకుండా, మన ఆచరణలోనూ ప్రతిఫలించాలి. వ్యక్తులను చంపడం సులభం, కానీ గొప్ప ఆశయాలను చంపలేరు. సామ్రాజ్యాలు కుప్పకూలవచ్చు కానీ భావాలు అమరంగా మిగిలిపోతాయి. ఇది భగత్ సింగ్ వదిలిన సందేశం. ఆ సందేశాన్ని గుండెల్లో నింపుకుని నవ భారతాన్ని నిర్మిద్దాం. ప్రతి ఏటా జయంతి, వర్ధంతి... చిత్రపటాలకు పూలమాలలు... రెండు నినాదాలు... మౌనం...ఇదేనా భగత్ సింగ్ త్యాగానికి మనం ఇచ్చే ప్రతిఫలం? ఖచ్చితంగా కాదు! అన్యాయం రాజ్యమేలుతున్నప్పుడు మౌనం కాదు.. ప్రశ్నించడమే విప్లవం. విద్య, ఉపాధి, స్త్రీ స్వేచ్ఛ, కార్మిక హక్కుల కోసం పోరాటమే నిజమైన నివాళి. కులమత గోడలు కూలాలి... మతోన్మాదం చెదరాలి... సమాన సమాజం నిర్మించాలి. విగ్రహాలకు పూలమాలలు కాదు... ఆశయాలకు ఆచరణే గౌరవం.అదే భగత్ సింగ్‌కు మనం అర్పించే నిజమైన అక్షర నీరాజనం!



గడగోజు రవీంద్రాచారి
జర్నలిస్టు
9848772232

# ప్రియాంకకు అగ్నిపరీక్ష అస్సాం

ఎవ్వరూ ఊహించని విధంగా వ్యవహరిస్తూ ఉండటం, పార్టీ సీనియర్ నేతలకు సహితం అందుబాటులో ఉండకపోవడంతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్ల కాంగ్రెస్ పార్టీలో ఓ విధమైన అసంతృప్తి పెరుగుతుంది. కీలక సమయాలలో ఆయన కన్పించక పోవడం పట్ల అసహనం వ్యక్తం అవుతుంది. ఆయన 'అసమర్థత' కారణంగానే ప్రధాని నరేంద్ర మోదీ తిరుగులేని నాయకుడిగా దేశ రాజకీయాలపై ఆధిపత్యం వహిస్తున్నారని పలువురు బహిరంగంగానే వాఖ్యానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అందరి దృష్టి ప్రియాంక గాంధీపై పడుతుంది. ఆమెను ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదే అన్నట్లు పలువురు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ఆమె తన రాజకీయ సామర్థ్యాన్ని ఎక్కడా నిరుపిందుకోలేక పోయారు. ఆమెకు పార్టీ అప్పచెప్పిన ఏ పనిలో కూడా విజయం సాధించలేకపోయారు. ఒక విధంగా 'సూట్ బూట్ కి సర్కార్', 'గబ్బర్ సింగ్ టాక్స్' వంటి పదజాలం నుండి తాజాగా అమెరికాకు ప్రధాని మోదీ లో లొంగిపోయారనే వరకు మోదీ ప్రభుత్వానికి నిత్యం 'గుదిబండ'గా మారారు. మరే ఇతర ప్రతిపక్ష నేత కూడా రాహుల్ గాంధీ మాదిరిగా రఫెల్ ఒప్పందం నుండి అమెరికాతో వాణిజ్య ఒప్పందం, చైనా సరిహద్దుల నుండి పాకిస్తాన్ తో కాల్పుల విరమణ వరకు ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేయలేదని చెప్పవచ్చు. తాజాగా అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఇన్ ఛార్జ్ గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక గాంధీ ఏమిచేస్తారనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఒక నెల వ్యవధిలోనే అస్సాం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు — లోక్‌సభ ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్, రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు భూపేన్ బోరా బీజేపీలో చేరడం, ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ చేస్తున్న ప్రచారాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రియాంక గాంధీ వాద్రా నాయకత్వాన్ని సహితం సవాల్ చేస్తున్నది. ప్రద్యుత్ బోర్డోలోయ్ బీజేపీలో చేసిన మరుసటి రోజు ఆయన కుమారుడు ప్రతీక్, మార్గెరిటా నియోజకవర్గం నుండి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడికి లేఖ రాశారు. బిజెపి ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఆయన దిస్పూర్ అభ్యర్థి. అస్సాం కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు దివ్యజ్యోతి తాలూక్దార్ కూడా పార్టీకి రాజీనామా చేశారు. అస్సాంలో పార్టీ వ్యవహారాల్లో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికను పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది మే నెలలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన లోక్‌సభ ఎంపీ గౌరవ్ గోగోయ్‌ను అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడం, అసెంబ్లీ ఎన్నికలలో ప్రియాంకకు కీలక పాత్ర కల్పించడం వంటి చర్యలను, దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న బీజేపీ నుండి రాష్ట్రాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందనడానికి సంకేతాలుగా చెప్పవచ్చు. అయితే, గోగోయ్ నియామకం కాంగ్రెస్ శ్రేణులలో అసంతృప్తికి కారణమవుతోంది. 2015లో పార్టీని వీడిన మాజీ కాంగ్రెస్ నాయకుడు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఫిరాయింపుల వెనుక సూత్రధారి అన్నది బహిరంగ రహస్యమే అయినప్పటికీ, రాష్ట్ర విభాగంలో కుళ్లు చాలా లోతుగా పాతుకుపోయిందని పార్టీ నాయకులు అంగీకరిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార నిర్వహణ రెండింటిలోనూ గోగోయ్ ‘ఏకపక్షంగా’ వ్యవహరిస్తున్నారని చాలా మంది నాయకులు ఆరోపిస్తున్నారు. “అతను (గౌరవ్) ఎవరినీ నమ్మడు. ప్రతి ఒక్కరూ హిమంత ఏజెంట్లే అని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు



నిర్వహించే బాధ్యతను పార్టీ (రాజకీయ వ్యూహకర్త) సునీల్ కనుగోలుకు అప్పగించినప్పటికీ, గౌరవ్ తన సొంత సర్వే కోసం మరో ఏజెన్సీని రంగంలోకి దించినట్లు మాకు తెలిసింది. అంతేకాక, అభ్యర్థుల ఎంపిక కోసం డబ్బు చేతులు మారిందనే నిరాధారమైన వదంతులు కూడా ఉన్నాయి,” అని ఒక ఏఐసీసీ నాయకుడు తెలిపారు."వేచి చూడండి, త్వరలోనే అసోం కాంగ్రెస్‌లో ఒక్క హిందూ నాయకుడు కూడా మిగలడు; ఎందుకంటే ఆ పార్టీ అనుసరిస్తున్న 'సంతుష్టీకరణ' విధానం పట్ల వారు విసిగిపోయారు. అంతేకాక ఈ విధానం అసోం జనాభా స్వరూపంపై చూపే ప్రభావం గురించి వారు ఆందోళన చెందుతున్నారు" అంటూ ముఖ్యమంత్రి శర్మ నేరుగా గాంధీ కుటుంబాన్నే సవాల్ చేసేవిధంగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నుండి జరిగిన ఉన్నత స్థాయి ఫిరాయింపులు, ఉత్తర ప్రదేశ్ వెలుపల మరో రాష్ట్రంలో ఎన్నికలను నిర్వహించడానికి ప్రియాంక చేసిన తొలి ప్రయత్నంపై నీలినీడలు కమ్మేలా చేశాయి. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, రాహుల్‌ల వెనుక సంవత్సరాల తరబడి నిశ్శబ్ద తెరవెనుక శక్తిగా పనిచేసిన తర్వాత, 2019 లోక్‌సభ ఎన్నికలకు తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీగా ఆమె ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణలో చేసిన మొదటి ప్రయత్నం ఘోరంగా విఫలమైంది. యూపీలోని 80 స్థానాలకు గాను కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానాన్ని మాత్రమే గెలుచుకోగలిగింది. అది కూడా రాయ్‌బరేలీలో సోనియా. అలాగే, తమ కుటుంబ కంచుకోట అయిన అమేథీలో రాహుల్ కూడా ఓడిపోయారు. మూడేళ్ల తర్వాత యూపీ అసెంబ్లీ ఎన్నికలలో పూర్తిస్థాయి ఎన్నికల నిర్వాహకురాలిగా, ప్రచారకర్తగా ప్రియాంక చేసిన మొదటి ప్రయత్నంలో కూడా విఫలమయ్యారు. “నేను అమ్మాయిని, పోరాడగలను” (లడ్కీ హూన్, లడ్ సక్తీ హూన్) అనే నినాదంతో మహిళా ప్రాధాన్య ప్రచారం చేసినప్పటికీ, రాష్ట్రంలోని 403 స్థానాలకు గాను పార్టీ కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగింది. ఇప్పుడు అస్సాంలో ఆమె ఒక పూర్తిస్థాయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. బోర్డోలోయ్ విషయంలో జరగబోయేది స్పష్టంగా తెలిసినప్పటికీ, కాంగ్రెస్‌తో దశాబ్దాల అనుబంధం కారణంగా ఆయన పార్టీ మారరని ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ ఆశించాయి. నాగావ్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన, అస్సాంలో గతంలో తరుణ్ గోగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలలో మూడుసార్లు మంత్రిగా పని చేశారు. కానీ, పరిస్థితులు అంతకంటే చాలా క్లిష్టంగా ఉన్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు నెలల క్రితం అస్సాం కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశంలో, గౌరవ్ గోగోయ్ ఖచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారని, తాను, ఇతర సీనియర్ నాయకులు ఆయన కింద పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని బోర్డోలోయ్ చెప్పి ఏఐసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులను ఆశ్చర్యపరిచారు. కానీ, గోగోయ్ పనితీరు పట్ల బోరా, బోర్డోలోయ్ ఇద్దరూ అసంతృప్తిగా ఉన్నారు. “బోర్డోలోయ్ ఏపీసీసీ అధ్యక్ష, ముఖ్యమంత్రి పదవుల రేసులో లేరని చెబుతున్నప్పటికీ, గోగోయ్‌ను వాస్తవంగా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలన్న ఏఐసీసీ నిర్ణయం అసంతృప్తిని రేకెత్తించిందన్నది విస్మరించలేని వాస్తవం. తరుణ్ గోగోయ్‌కు 80 ఏళ్లు పైబడ్డాయి. గౌరవ్‌కు ఇంకా 40 ఏళ్లే. 50, 60 ఏళ్ల వయసులో ఉన్న నాయకుల తరం ఒకటి ఉంది, వారు నిరాశకు గురయ్యారు,” అని ఒక రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల కోసం బోరా పార్టీ ప్రచార కమిటీకి అధిపతిగా, బోర్డోలోయ్ మేనిఫెస్టో ప్యానెల్‌కు నేతృత్వం వహించడం కాంగ్రెస్‌లో మరింత ఆందోళనను రేకెత్తించింది. “మేము మా మేనిఫెస్టోను ఏ ముఖంతో విడుదల చేస్తాం? మా ప్రచార కమిటీ అధిపతి బీజేపీలో చేరిన నెల రోజులకే, మా మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ స్వయంగా అవతలి పక్షంలోకి వెళ్లిపోయారు,” అని ఒక కాంగ్రెస్ నాయకుడు ఆందోళన వ్యక్తం చేశారు. బోర్డోలోయ్ నిష్క్రమణకు తక్షణ కారణం, ఆయన నాగావ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే లహరిఘాట్ స్థానంలో అభ్యర్థి ఎంపిక విషయంలో తలెత్తిన విషయమే. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆసిఫ్ మహమ్మద్ నజర్‌ను మళ్లీ బరిలోకి దించడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఏఐసీసీ అస్సాం వ్యవహారాల ఇన్‌చార్జ్ జితేంద్ర సింగ్‌కు రాసిన లేఖలో, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ జరిపిన సంప్రదింపుల సమయంలో తాను “అవమానానికి గురయ్యానని” బోర్డోలోయ్ పేర్కొన్నారు. తనపై దాడి చేసినందుకు అరెస్టు అయిన ఒక వ్యక్తికి, నజర్ అనే నాయకుడు అండగా నిలుస్తున్నారన్న తన ఆందోళనలను పార్టీ సీరియస్‌గా తీసుకోలేదని కూడా ఆయన ఆరోపించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 2022లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మల్లికార్జున ఖర్గేపై పోటీ చేసిన తన సహ లోక్‌సభ సభ్యుడు శశి థరూర్ అభ్యర్థిత్వానికి బోర్డోలోయ్ తన పూర్తి మద్దతును ప్రకటించారు. పార్టీలో విబేధాలు తలెత్తినప్పుడు సర్దుబాటు చేసే ప్రయత్నం చేయకుండా రాహుల్ గాంధీ తనకు సన్నిహితులైన వారిని వెనుకవేసుకు రావడం కారణంగా అనేకమంది ప్రముఖులను కోల్పోవాల్సి వచ్చింది. ప్రియాంక సహితం అందుకు భిన్నంగా వ్యవహరింపలేరని అస్సాంలోని పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎన్నికలలో ఆమె కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాలేకపోయినా బిజెపి దూకుడును కట్టడి చేయలేని పక్షంలో రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో ఆమె ప్రాబల్యం మసకబారి అవకాశం ఉంది. చిరునవ్వులతో అందరితో మాట్లాడటం తప్ప రాజకీయంగా పార్టీని ముందుకు తీసుకు వెళ్లలేరనే అభిప్రాయం బలపడే అవకాశం ఉంది.



చలసాని నరేంద్ర
9849569050

# నీ విలువ నీకు తెలుసా?

మానవ జీవితం రంగుల మయం, విలువల సమాహారం. సమాజంలో ఒక వ్యక్తికి ఉండే హోదా, ఆస్తిపాస్తులు, అధికారం కంటే అత్యంత విలువైనది మరొకటి ఉంది. అదే స్వీయ గౌరవం లేదా ఆత్మగౌరవం . ఇది కేవలం ఒక పదం కాదు.మనిషి అంతరాత్మ పలికే ధైర్య వచనం. ఒక వ్యక్తి తన గురించి తాను ఏమనుకుంటున్నాడు? తన సామర్థ్యాల మీద తనకెంత నమ్మకం ఉంది? అనే అంశాలే అతని జీవిత గమనాన్ని నిర్దేశిస్తాయి. ఈ స్వీయ గౌరవం కోల్పోతే, ఆ వ్యక్తి ఒక దీపం లేని గదిలా చీకటిలో ఉండిపోతాడు. చాలామంది స్వీయ గౌరవాన్ని అహంకారం (Ego) తో పొరబడుతుంటారు. కానీ ఈ రెండింటికీ ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంది. అహంకారం అంటే నేనే అందరికంటే గొప్పవాడిని అనుకోవడం. స్వీయ గౌరవం అంటే నేను కూడా అందరిలాగే విలువైన వాడిని, నాకంటూ కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి అని నమ్మడం. ఇది పుట్టుకతోనే ఎవరికీ రాదు. ఒక శిశువు పెరుగుతున్న క్రమంలో, చుట్టూ ఉన్న పరిసరాలు, తల్లిదండ్రుల మాటలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ద్వారా ఇది రూపుదిద్దుకుంటుంది. చిన్నప్పుడు ఒక చిన్న బొమ్మ గీసినప్పుడు చాలా బాగుంది అని మెచ్చుకుంటే, ఆ బిడ్డలో తనపై తనకి నమ్మకం పెరుగుతుంది. అదే నీకు చేతకాదు అని విమర్శిస్తే, అక్కడ ఆత్మగౌరవ క్షీణత మొదలవుతుంది.మనం నివసించే సమాజం ఒక్కోసారి చాలా కఠినంగా ఉంటుంది. వ్యక్తిలో ఆత్మగౌరవం తగ్గడానికి ప్రధానంగా ఈ అంశాలు కారణమవుతాయి,ఇంట్లో కానీ, ఆఫీసులో కానీ చేసే పనిని ఎప్పుడూ తక్కువ చేసి చూడటం వల్ల వ్యక్తి మానసికంగా కుంగిపోతాడు. వాడిని చూడు ఎంత బాగా చదువుతున్నాడో, నువ్వు ఎందుకు పనికిరావు అనే పోలికలు మనిషిలో ఉన్న సహజ సిద్ధమైన ప్రతిభను చంపేస్తాయి.ఒకసారి ఓడిపోగానే జీవితం అయిపోయిందనుకోవడం. ఆ ఓటమికి సమాజం ఇచ్చే వింత తీర్పులు వ్యక్తిని తనను తాను నిందించుకునేలా చేస్తాయి.బహిరంగంగా అందరి ముందు అవమానానికి గురైనప్పుడు, ఆ గాయం మనిషి మనసుపై చెరగని ముద్ర వేస్తుంది.స్వీయ గౌరవం కోల్పోయిన వ్యక్తి నిరంతరం తనలో తాను ఒక యుద్ధం చేస్తూ ఉంటాడు. దీని ప్రభావం మానసిక ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటుంది.నేను దేనికీ పనికిరాను అనే భావన మెదడులో పాతుకుపోయినప్పుడు అది డిప్రెషన్‌కు దారి తీస్తుంది. రేపటి గురించి భయం, నిరంతర ఆందోళన (Anxiety) వారిని వెంటాడుతుంటాయి.మనతో మనం మాట్లాడుకునే మాటలు చాలా శక్తివంతమైనవి. ఆత్మగౌరవం లేని వారు ఎప్పుడూ నావల్ల కాదు,నేను అదృష్టవంతుడిని కాను అని ప్రతికూలంగా మాట్లాడుకుంటారు. ఇది వారి చుట్టూ ఒక ప్రతికూల వలయాన్ని సృష్టిస్తుంది.మనిషి ఒంటరిగా బతకలేడు. కానీ స్వీయ గౌరవం లేకపోతే ఇతరులతో బంధాలను పంచుకోవడం ఒక భారంలా మారుతుంది.భార్యాభర్తల మధ్య గౌరవం



సమానంగా ఉండాలి. ఒక భాగస్వామి తనను తాను తక్కువగా భావిస్తే, వారు ఎప్పుడూ ఎదుటివారి ఆమోదం (Validation) కోసం పాకులాడుతుంటారు. నన్ను ప్రేమిస్తున్నావా?,నేను బాగున్నానా? అని పదే పదే అడగడం వెనుక ఉన్నది ప్రేమ కాదు, అభద్రతా భావం. దీనివల్ల బంధంలో అసంతృప్తి పెరుగుతుంది. కొందరు తమ గౌరవాన్ని తాకట్టు పెట్టి కూడా వేధింపులను భరిస్తుంటారు, ఎందుకంటే వారికి నేను ఒంటరిగా బతకలేను లేదా నాకు ఇంతకంటే మంచి జీవితం దొరకదు అనే భయం ఉంటుంది.

నిజమైన స్నేహితుడు మనల్ని మనలాగే ప్రేమిస్తాడు. కానీ ఆత్మగౌరవం లేని వారు తప్పుడు స్నేహాల వలలో చిక్కుకుంటారు. తమను వాడుకునే వారిని కూడా స్నేహితులు అనుకుని పొరబడతారు. ఎవరైనా చిన్న జోక్ వేసినా, అది తనను ఉద్దేశించి చేసిన అవమానంగా భావించి కుంచించుకుపోతారు.నేటి పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసమే ఆయుధం. ఆత్మగౌరవం లేని ఉద్యోగి ఎంత ప్రతిభ ఉన్నా వెనుకబడిపోతాడు. ఈ ప్రాజెక్ట్ నేను చేయగలనా? ఒకవేళ ఫెయిల్ అయితే అందరూ నవ్వుతారు అనే భయంతో కొత్త బాధ్యతలను తీసుకోరు.పని పట్ల భయం వల్ల దానిని వాయిదా వేస్తుంటారు. ఇది వారి కెరీర్ గ్రాఫ్ పడిపోవడానికి కారణమవుతుంది.ఏదైనా విజయం సాధించినా, అది తన కష్టం వల్ల కాకుండా లక్ వల్ల వచ్చిందని నమ్ముతారు. దీనిని సైకాలజీలో ఇంపోస్టర్ సిండ్రోమ్ అంటారు.మనస్సు శరీరానికి ప్రతిబింబం. మనసులో ఒత్తిడి ఉంటే అది శరీరంపై రకరకాలుగా కనిపిస్తుంది. ఆలోచనల సుడిగుండంలో పడి రాత్రంతా నిద్ర పట్టకపోవడం.ఒత్తిడి వల్ల కొందరు అతిగా తింటారు (Binge eating), మరికొందరు అసలు తినరు. ఇది స్థూలకాయం లేదా నీరసానికి దారితీస్తుంది. మనసులో ఉన్న వెలితిని పూడ్చుకోవడానికి, బాధను మర్చిపోవడానికి మద్యం, ధూమపానం లేదా మాదక ద్రవ్యాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంది. తన శరీరాన్ని తను గౌరవించుకోని వ్యక్తి, దాని ఆరోగ్యం గురించి పట్టించుకోడు.

స్వీయ గౌరవం లేని వ్యక్తులు సామాజికంగా ఒంటరి అయిపోతుంటారు. పదిమంది ఉన్న చోటికి వెళ్లడానికి వారు జంకుతారు. నేను మాట్లాడితే ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో,నా బట్టలు బాగున్నాయా లేదా? అనే చిన్న చిన్న విషయాలే వారిని ఇబ్బంది పెడతాయి. ఈ ఒంటరితనం వారిని సమాజానికి దూరం చేసి, మరింత మానసిక కుంగుబాటుకు గురి చేస్తుంది.మనం మన పిల్లలకు ఇచ్చే అతిపెద్ద ఆస్తి డబ్బు కాదు, ఆత్మగౌరవం. తల్లిదండ్రులు తమను తాము తక్కువ చేసుకుని మాట్లాడుకుంటే, పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. పిల్లల చిన్న చిన్న విజయాలను అభినందించడం, వారు తప్పు చేసినప్పుడు మనిషిని కాకుండా ఆ తప్పును మాత్రమే విమర్శించడం నేర్చుకోవాలి. నువ్వు దేనికీ పనికిరావు అనే ఒక్క మాట ఆ బిడ్డ భవిష్యత్తును నాశనం చేయగలదు కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి సంపాదించుకోవడం అసాధ్యం కాదు. ఇది ఒక ప్రయాణం. మీలో ఉన్న ప్లస్ పాయింట్స్ ఏమిటో ఒక పేపర్ మీద రాయండి. మీరు ఇతరులకు చేసిన చిన్న సహాయం కూడా మీ గొప్పతనమే.మిమ్మల్ని తక్కువ చేసే హక్కు ఎవరికీ లేదు. అవసరమైనప్పుడు వద్దు లేదా లేదు అని చెప్పడం నేర్చుకోండి. ఇది ఆత్మగౌరవానికి మొదటి మెట్టు.ఒకేసారి హిమాలయాలు ఎక్కలేం. చిన్న చిన్న పనులు పూర్తి చేస్తూ, మిమ్మల్ని మీరు మెచ్చుకోండి. మిమ్మల్ని ఉత్సాహపరిచే వ్యక్తులతో స్నేహం చేయండి. విషపూరితమైన బంధాల (Toxic Relationships) నుండి బయటకు రండి. అవసరమైతే థెరపిస్ట్ లేదా కౌన్సిలర్ సహాయం తీసుకోండి. మనసు గాయపడినప్పుడు వైద్యం చేయించుకోవడం తప్పు కాదు.జీవితం ఒక అద్భుతమైన అవకాశం. ఇందులో ఆటుపోట్లు సహజం. కానీ, మనల్ని మనం గౌరవించుకోవడం మానేసిన రోజున, ప్రపంచం కూడా మనల్ని గౌరవించడం ఆపేస్తుంది. నన్ను నేను ప్రేమిస్తున్నాను, గౌరవిస్తున్నాను అని గట్టిగా చెప్పగలిగే ధైర్యం ప్రతి ఒక్కరిలో ఉండాలి. గుర్తుంచుకోండి, సూర్యుడు అందరికీ సమానంగా వెలుగునిస్తాడు. మీరు ఏ పరిస్థితుల్లో ఉన్నా, మీకంటూ ఒక ప్రత్యేకత ఉంది. ఆత్మగౌరవం అనేది మనం ఇతరుల నుండి ఆశించేది కాదు, మనకు మనం ఇచ్చుకునే బహుమతి. మీ విలువను గుర్తించండి, తలెత్తుకుని జీవించండి.



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169



# గ్రేటర్ హైదరాబాద్



## అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం



**షాద్ నగర్ బిజెపి నేత, సీనియర్ న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి**

**షాద్ నగర్, మార్చి 23 (వుదయం) :** ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగేందుకు వెళుతుంటే బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని సీనియర్ న్యాయవాది, బిజెపి మాజీ కౌన్సిల్ సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. బిజెపి నాయకుల అరెస్టులపై ఆయన స్పందిస్తూ భారతదేశంలో స్వాతంత్ర సాధన తో మొదలుపెట్టి తెలంగాణ సాధన వరకు ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీల ద్వారానే విజయం సాధించామని గుర్తు చేశారు. అలాంటిది ప్రజల తరపున ఆందోళనకు తరలుతున్న బిజెపి నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదన్నారు. రాజకీయంగా ఇది ప్రజల హక్కులను కాలరాయడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్

**ఎమ్మెల్సీ డా.చిన్న మైల్ అంజిరెడ్డి**



**రామచంద్రపురం మార్చి 23 ( ఉదయం) :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తు, ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తుందని ఎమ్మెల్సీ డా.చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. బీజేపీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలోని ఆయన స్వగృహంలో ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖనిచేస్తుందని మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తుందన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. కాంగ్రెస్ పాలనలో కేవలం అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తుంది. కాంగ్రెస్ ఎన్నికల ముందు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించింది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు బీజేపీ పోరాటం చేస్తుంది. పోలీసులు గృహనిర్బంధం చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ భయాన్ని బహిర్గతం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పిరికిపంద చర్యలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు.' అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోదావరి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## శంకరన్నకు శుభాకాంక్షలు

**కాంగ్రెస్ పార్టీ ఓబిసి విభాగం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం**

గాంధీభవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబిసి విభాగం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి.





టిపిసిసి ఓబిసి విభాగం తెలంగాణ రాష్ట్ర చైర్మన్ గా ప్రమాణ స్వీకారోత్సవం చేసిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపలి శంకర్‌కు షాద్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ శుభాభినందనలు తెలియజేశారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సయ్యద్ సాదిక్ హాజరయ్యారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప పదవులు అలంకరించాలని రాష్ట్రస్థాయిలో రాజకీయంగా రాణించాలని కోరారు. ఓబిసి పదవికి చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- షాద్ నగర్, వుదయం

## అపరిచితుల మెసేజ్‌లు, వీడియోలకు స్పందించొద్దు

- షీ టీం ఇంచార్జి ఎస్ఐ శ్యామ్ సుందర్
- షీ టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు




**చేవెళ్ల, మార్చి23 (వుదయం) :** చేవెళ్ల డివిజన్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సభ్యులు మహిళల భద్రత, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో షీ టీం ఇంచార్జి ఎస్ఐ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నపిల్లలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే సహించకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112 నంబర్లకు కాల్ చేయాలని, సైబర్ నేరాల కోసం 1930, బాల్య వివాహాలు లేదా చిన్నపిల్లల సమస్యల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను సంప్రదించాలని తెలిపారు.ఈవ్‌టీజింగ్ ఘటనలు జరిగితే చేవెళ్ల షీటీం నంబర్ 8712663673కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సోషల్ మీడియా ఓటీపీ మోసాలు ఆన్‌లైన్ గేమ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో అపరిచితుల మెసేజ్‌లు, వీడియోలకు స్పందించవద్దని, వ్యక్తిగత ఫోటోలను అప్లోడ్ చేయడంలో జాగ్రత్త వహించాలని తెలిపారు.అలాగే విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, చదువే జీవితాన్ని మార్చే శక్తి అని ప్రోత్సహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, సిబ్బంది, చేవెళ్ల షీ టీం సభ్యులు మల్లేష్, జ్యోతి, వైద్యనాథం తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్‌కు ఘన నివాళులు

**ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్**

**పిడిఎస్‌యు నాయకులు**



**చేవెళ్ల, మార్చి23 (వుదయం) :** స్వతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని భగత్ సింగ్ విగ్రహానికి పిడిఎస్‌యు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ మాట్లాడుతూ...భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అగ్రశ్రేణి యోధులుగా నిలిచారని పేర్కొన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో లాలా లజపతిరాయ్ మరణానికి ప్రతీకారంగా బ్రిటిష్ అధికారిపై దాడి చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని తెలిపారు.యువత, రైతులు, కార్మికులను ఉద్యమంలోకి తీసుకురావడానికి నవజవాన్ భారత్ సభను స్థాపించినట్లు ఆయన గుర్తుచేశారు. బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ సేఫ్టీ బిల్‌కు నిరసనగా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో బాంబులు విసిరినందుకు వారిని అరెస్టు చేసి, 1931 మార్చి 23న ఉరి తీశారని తెలిపారు.కుల, మత భేదాలు లేని సమాజం కోసం ఈ విప్లవ వీరులు తమ ప్రాణాలను అర్పించారని అన్నారు."ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదంతో దేశభక్తిని చాటుకున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా ఎన్నికల హామీల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు డివిజన్ అధ్యక్షుడు అశోక్ కార్యదర్శి శ్రీకాంత్ సభ్యులు సురేష్ అనిల్ రాజేష్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



## సమానత్వానికి విద్యే బాట

**విద్యా భారతి పాఠశాలకు రూ.20 లక్షల విరాళం**

**తరగతి గదులు ప్రారంభించిన ఎమ్మెల్యే**

**రామచంద్రాపురం,మార్చి 23(వుదయం) :** విద్య మనిషి జీవితాన్ని మలిచే శక్తివంతమైన సాధనమని, సమాజంలో సమానత్వాన్ని పెంపొందించేది విద్యేనని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో ఉన్న విద్యా భారతి పాఠశాలలో ₹20 లక్షల సొంత నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ .. భారతీయ సంస్కృతి, జాతీయ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి విద్యా భారతి సంస్థలు కృషి చేస్తున్నాయని అభినందించారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంచాలని సూచించారు.

ప్రతి విద్యార్థి లక్ష్యసాధనతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ మార్పులకు అనుగుణంగా విద్యా విధానంలో సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన ఎమ్మెల్యేను సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యా భారతి సంస్థ దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, భారతీ విద్యా సమితి అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి రవి, టప్పు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శం గ్రామస్తుల ఐక్యత

**50 ఏళ్ల పాత బాటకు కొత్త రూపు**

- చెందిప్ప నుంచి ఎలివేర్తి నక్షబాట రహదారి విస్తరణకు శ్రీకారం
- గ్రామ పంచాయతీ పాలకవర్గం సమక్షంలో పనులు ప్రారంభం



**శంకర్‌పల్లి, మార్చి 23 (వుదయం) :** శంకర్‌పల్లి మండలంలోని చెందిప్ప గ్రామం నుంచి ఎలివేర్తి వరకు ఉన్న నక్షబాట రహదారిని విస్తరించే పనులను గ్రామ ప్రజలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. గత 50 సంవత్సరాలుగా ఉపయోగంలో ఉన్న ఈ బాట రహదారి సన్నగా ఉండటంతో ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి ప్రారంభించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అందరూ కలిసికట్టుగా రోడ్డును విస్తరించే పనుల్లో పాల్గొంటున్నారు. యంత్రాల సహాయంతో పాటు శ్రమదానం చేస్తూ పనులను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ఈ రహదారి విస్తరణతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభం కానున్నాయి.

చెందిప్ప నుంచి ఎలివేర్తి వరకు ఉన్న ఈ నక్షబాట రహదారి చాలా కాలంగా గ్రామస్తులకు ముఖ్యమైన మార్గంగా ఉపయోగపడుతోంది. అయితే రహదారి సన్నగా ఉండటంతో వాహనాలు సరిగ్గా వెళ్లలేకపోవడం, వర్షాకాలంలో మట్టి కారణంగా జారిపడే ప్రమాదాలు చోటుచేసుకోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలే ముందుకు వచ్చి రహదారిని పెద్దదిగా మార్చడం అభినందనీయంగా మారింది.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి సమస్యను ప్రభుత్వంపై మాత్రమే ఆధారపడకుండా, ప్రజలే ముందుకు వచ్చి పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం మంచి విషయమని అన్నారు. ఈ రహదారి విస్తరణ పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యాక చెందిప్ప – ఎలివేర్తి మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, గ్రామ అభివృద్ధికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి విస్తరణ పనులు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## బ్లాక్‌మెయిలర్స్ భరతం పడదాం

**షాద్ నగర్‌లో టీడబ్ల్యుజెఎఫ్ సమావేశం**

**జర్నలిస్టుల సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, ఖాజాపాషా కెపి**





**షాద్ నగర్, మార్చి 23 (వుదయం) :** నకిలీల పేరుతో మోసాలు చేస్తున్నారు.. పేరున్న పత్రికల పేర్లు చెప్పి దందాలు నడిపిస్తున్నారు.. బ్లాక్‌మెయిల్‌తో పాటు దాడులకు పాల్పడుతున్నారు.. జర్నలిజం స్థాయిని దిగజారుస్తున్న ఇలాంటి వ్యక్తులపై నడుంబిగించాల్సిన అవసరం ఉంది.. కలిసికట్టుగా పోరాడుదాం.. ఇలాంటి నకిలీ గాళ్ళ గుట్టును రట్టు చేద్దాం.. అని సీనియర్ జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, ఎండి ఖాజాపాషా (కెపి) పిలుపునిచ్చారు. షాద్ నగర్ పట్టణంలో సోమవారం టిడబ్ల్యుజేఎఫ్ సమావేశాన్ని డివిజన్ అధ్యక్షుడు జే.రాఘవేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్‌రెడ్డి జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నకిలీ జర్నలిస్టుల కారణంగా జర్నలిస్టులం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మూడు దశాబ్దాల పైగా జర్నలిజంలో విలువలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగామని, ఇలాంటి విలువలు లేని వ్యక్తుల వల్ల అందరికీ చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బతకడానికి చాలా మార్గాలు ఉన్నాయి.. జర్నలిజాన్ని కేవలం సేవల కోసం మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

జర్నలిజంను పార్ట్ టైం గా చేసుకొని ప్రతి ఒక్కరు ఏదో ఒక వృత్తి ద్వారా సంపాదించుకోవాలని అన్నారు. అదేవిధంగా జర్నలిజంపై తగిన శిక్షణ పొంది జర్నలిజం స్థాయిని పెంచాలని సూచించారు. వార్తలు రాసే వారే జర్నలిస్టులని, బ్లాక్ మెయిల్ చేసేవారు నకిలీ జర్నలిస్టులని ఆయన వెల్లడించారు. నూటికి నూరు శాతం అంకిత భావంతో పని చేసినప్పుడే జర్నలిస్టుగా గుర్తింపు పొందుతామని వెల్లడించారు. సభ్యులు కోరినట్లు ఏప్రిల్ మొదటి లేదా రెండో వారంలో జర్నలిస్టులకు తరగతులు నిర్వహించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**జర్నలిస్టులు అని దాడులు చేస్తారా..**

జర్నలిస్టులు అంటే సంఘటన స్థలానికి వెళ్లాలి.. ఫోటోలు, వీడియోలు తీయాలి.. వార్తలు రాయాలి.. అంతేతప్ప అవతలి వ్యక్తుల మీద దాడి చేసే హక్కు ఎవరిచ్చారు.. ఇలా దాడులకు పాల్పడే వారిని జర్నలిస్టులు అంటారా.. అని జర్నలిస్ట్ కేపీ విరుచుకుపడ్డారు. ఫరూక్ నగర్ మండలం విఠ్యాల గ్రామంలో కొందరు జర్నలిస్టుల పేరు మీద ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరు అసలు జర్నలిస్టులో.. ఎవరు నకిలీ జర్నలిస్టులో.. అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నకిలీల కారణంగా అసలైన జర్నలిస్టులు బదనాం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల రిపోర్టర్లు అంటేనే తరిమికొట్టే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. ఫేక్ జర్నలిస్టుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. జర్నలిస్టులు కనీస డిగ్రీలతో తమను తాను తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. గతంలో ఎల్బీనగర్ విలేకరుల వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చినందుకు స్థానిక విలేకరిపై దాడికి ప్రయత్నించారని గుర్తు చేశారు. ఇలాంటి వాటిని నిరోధించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని, పోలీసులను, అధికారులను కలిసి వినతి పత్రాలు అందించాలని సూచించారు. డబ్బులకు అలవాటు పడి విలువలను చంపుకునే సంస్కృతికి ప్రతి ఒక్కరూ స్వస్తి చెప్పాలని సూచించారు. ఏ సమస్య ఉన్న జర్నలిస్టులందరికీ తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**శిక్షణ ఇవ్వండి..**

జర్నలిస్టులకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని సరైన మార్గంలో నడిపే ప్రయత్నం చేయాలని అధ్యక్ష కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, నరేష్, సీనియర్ జర్నలిస్ట్ రంగనాథ్, సంజీవ్ కుమార్, బాల రాజేష్, లక్ష్మణ్, రమణ, ఖాజా సోహెల్, సాయినాథ్ రెడ్డి, షకీల్, రాము, జిల్లా నాయకులు నర్సింహ రెడ్డి, ఖాజా సోహెల్, పలువురు జర్నలిస్టులు సమావేశంలో అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల జాబితా ఒకటి తయారు చేసి అధికారులకు, పోలీసులకు ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ బ్లాక్మెయిల్ కార్యకలాపాలకు పాల్పడుతున్న జర్నలిస్టుల ఆట కట్టించాలని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల్లో ఐక్యత లేకపోవడం వల్ల కూడా వేరే వాళ్ళు, నకిలీలు రంగ ప్రవేశం చేస్తున్నారని మరికొందరు పేర్కొన్నారు. ప్రెస్ కార్డులు ఇవ్వడం ద్వారా అసలైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని మరికొందరు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి నరేష్ జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్, టి.సంజీవ్ కుమార్, సరాపు రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సాయినాథ్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు రాకేష్, ఖాజా సోహెల్, చందర్ రాజు, తభాస్కర్, నరేందర్, సురేందర్, ధరంపాల్, షకీల్, ఆనంద్, అజీమ్, శేఖర్, రాజు, రియాజ్, అశోక, ఆవుల రమేష్ , దర్శనం శంకర్, జగన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడి సమాజానికి ప్రమాదం

**నిందితులను వెంటనే రిమాండ్‌కు డిమాండ్**



**చేవెళ్ల, మార్చి 23 (వుదయం) :** చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై జరిగిన దాడి సంఘటనపై ఎంజేఎఫ్ (మాదిగ జర్నలిస్ట్ ఫోరం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చేయాలని, జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని సంస్థ నాయకులు డిమాండ్ చేశారు.ఎంజేఎఫ్ చేవెళ్ల డివిజన్ కన్వీనర్ మహేష్ ఆశిగారి నేతృత్వంలో జర్నలిస్టులు కలిసి చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ ఆశిగారి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, వాస్తవాలను వెలుగులోకి తెచ్చే మీడియా ప్రతినిధులకు రక్షణ కల్పించడం ప్రభుత్వం, సమాజం బాధ్యత అని అన్నారు.క్షేత్ర స్థాయిలో పనిచేసే జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు, ఆన్‌లైన్ వేధింపులు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.షాబాద్ మండలంలో జరిగిన దాడి కూడా అదే పరిస్థితిని ప్రతిబింబిస్తుందని తెలిపారు.దాడి ఘటనపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి 20రోజులు గడిచినా నిందితులను రిమాండ్ చేయకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పోలీసులు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.ఈ జాప్యం వల్ల నిందితులు సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశముందని హెచ్చరించారు.జర్నలిస్టులు సమాజానికి నిజాలను తెలియజేసే బాధ్యతతో పనిచేస్తూ ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సమాచారం అందిస్తున్నారని మహేష్ అన్నారు. అలాంటి వారిపై దాడులు, బెదిరింపులు అపహరణలు హత్యలు వంటి ఘటనలు పెరుగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ నర్సాని రమేష్, జర్నలిస్టులు నరేందర్ అమర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ఉత్తరాఖండ్ డీఎడ్ లెక్చరర్ల బృందం

**జిన్నారం మార్చి 23 (వుదయం) :** బొల్లారం డివిజన్ పరిధిలోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎస్సీఈఆర్టీ ఆదేశాల మేరకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన డీఎడ్ లెక్చరర్ల బృందం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోధిస్తున్న పద్ధతులను నేరుగా పరిశీలించారు. రాయడం చదవడం అంశాలను తెలుసుకున్నారు. విద్యాశాఖ ద్వారా అమలవుతున్న విద్యాసంస్కరణలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బృందం సభ్యులను హెచ్‌ఎం అంజయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ డిఎస్ లింగ్వాల్, డాక్టర్ శివకుమార్ భరద్వాజ్, డాక్టర్ హరీ శంకర్ దిమ్మిరి, వినయ్ ప్రసాద్ కిమోతి, మమతా రానా, శివాని రావత్, హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు బాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు

- ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఫార్మ్ మెకనైజేషన్, తేనెటీగల పెంపకం పథకాలపై కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి జిల్లా ప్రతి నిధి, మార్చి 23, వుదయం :**

జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో జిల్లాలో అమలవుతున్న ఫార్మ్ మేకనైజేషన్, వర్షాదార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని పరిశీలించి, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని, రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని, ఈ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని, ఎక్కువ మంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, కమర్షియల్ స్థాయిలో తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ ఏపీడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 49 దరఖాస్తులు స్వీకరణ

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన 49 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత శాఖ అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు తమ



సమస్యలను నేరుగా అధికారులకు వినిపించే ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణిలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యం

### 18 ఫిర్యాదుల స్వీకరణ, తక్షణ చర్యలకు ఎస్పీ ఆదేశాలు

**గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి)** జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ, జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ప్రత్యక్షంగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా వినిపించిన ఎస్పీ, వాటిని స్వయంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అక్కడే ఉన్న డి.ఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల, శాంతినగర్ సర్కిల్ అధికారులను పిలిపించి, తమ పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే తీసుకున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనితీరుపై సమీక్ష నిర్వహించడం ద్వారా బాధ్యతాయుత పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలిచారు. ఫిర్యాదుల వివరాలు: భూ వివాదాలు 6, ప్లాట్ల సమస్యలు 2, వ్యక్తిగత గొడవలు 6, మసీదు సీసీ కెమెరాల ధ్వంసం 1, ఇతర సమస్యలు 3, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్‌లో నమోదు చేసి, నిరంతరం మానిటర్ చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో స్పందనతో కూడిన చర్యలు తీసుకోవడం పట్ల ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లా పోలీస్ వ్యవస్థపై విశ్వాసం వ్యక్తం చేశారు.

## భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వే పనుల్ని త్వరగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

**వనపర్తి మార్చ్ 23(వుదయం ప్రతినిధి )** జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న సర్వే పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులతో చర్చించారు. కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 34 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ పూర్తి అయినప్పటికీ ఇంకా సర్వే పూర్తి చేయకపోవడంపై సర్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వారంలోపు ఈ 34 ఎకరాల సర్వే పూర్తి చేసి, మార్చి 31 నాటికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ పబ్లిష్ చేసే విధంగా అడుగులు పడాలని ఆదేశించారు. జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు సర్వే పూర్తి అయిందని, ప్రిలిమినరీ నోటిఫికేషన్ మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద డి 1, డి 5, డి 8, ప్యాకేజ్ 29 కు సంబంధించి 92 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ 2 వారాలలోపు కంప్లీట్ చేయాలని, పెగ్ మార్కింగ్ తో పాటే సర్వే విభాగం అధికారులు ఎంజాయ్మెంట్ సర్వే కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాన్ చెరువుకు సంబంధించి 18.82 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్, సర్వే ఏకకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నీటి సరఫరా నిర్వహణకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఇప్పుడే పరిష్కరించుకోవాలని సూచించారు. గతేడాది సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, లైన్లను మరోసారి సరిచూసుకొని ఈ ఏడాది అటువంటి సమస్యలు తలెత్తకుండా తెలియజేశారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నీటిపారుదల శాఖ ఎస్ ఈ చంద్రశేఖర్, సర్వే ఏడి శ్రీనివాసులు, మిషన్ భగీరథ అధికారులు, ఇతర రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ప్రజావాణికి 34 ఫిర్యాదులు,
- జిల్లా అదనపు కలెక్టర్లు, అమరేందర్, జి.వీ శ్యామ్ ప్రసాద్ లాల్

**నాగర్ కర్నూల్ మార్చి 23(వుదయం ప్రతినిధి)** సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తో కలిసి అదనపు కలెక్టర్లు, అమరేందర్, జి.వీ శ్యామ్ ప్రసాద్ లాల్ , ,ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు, మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 34, ఫిర్యాదులు వచ్చాయని, ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 37 ఫిర్యాదులు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట మార్చి 23( వుదయం ప్రతినిధి)** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ సోమవారం ప్రజావాణి సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ జిల్లా మార్చి 23, పరిగి పట్టణం (వుదయం ప్రతినిధి )** 2016 సంవత్సరం లో పరిగి పోలీస్ స్టేషన్ పరిధి లోని కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కారాగార శిక్ష , 12000 రూపాయల విధిస్తూ తీర్పునిచ్చిందని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. పరిగి మండలం, బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య (37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం మరియు బెదిరింపులకు (IPC సెక్షన్లు 376, 506) సంబంధించి కేసు (Cr No: 268/2016) నమోదైంది. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కొనసాగింది. పోలీసులు సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ చౌదరి చంద్ర కిషోర్ గారు, నిందితుడు అంజయ్య దోషిగా నిర్ధారిస్తూ 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 12,000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విశేష కృషి చేసిన అధికారులను ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వై. నాగేష్ (అప్పటి పరిగి SI), పి. ప్రసాద్ (అప్పటి పరిగి సిఐ ), ప్రస్తుత పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ మోహన్ కృష్ణలను , అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పి.పి. శ్రీమతి మెరాజ్ ఫిర్దౌస్, సి.డి.ఓ జగన్ మోహన్ రెడ్డి, మరియు కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్. నిరంజన్ గౌడ్ ల పనితీరును ఎస్పీ గారు ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్: వుదయం ప్రతినిధి;** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణము డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.

99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి ,జడ్.పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ మంగీ లాల్ ,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ భవన ఆవరణలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి





### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట టౌన్ మార్చి 23( వుదయం ప్రతినిధి)** నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం ఆవరణ లో అంతర్గత రహదారుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు సమాంతరంగా రోడ్డు వేయాలన్నారు. అలాగే భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను అక్కడి నుంచి తొలగించి కొద్ది దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు పెట్టి గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీఆర్డీవో మొగులప్ప కు చెప్పారు. కలెక్టరేట్ సముదాయంతో పాటు బయట రోడ్లు, ఇతర పనుల్లో వేగం పెంచాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీ.ఈ.ఈ రాములు, పంచాయతీ రాజ్ ఈ ఈ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ

**నారాయణపేట మార్చి 23( వుదయం ప్రతినిధి )** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో కొనసాగుతున్న పరీక్షా సరళిని ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా విద్యా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. సోమవారం నాటి పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారని ఆరా తీశారు.

## ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

### జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ మార్చి 23( వుదయం ప్రతినిధి )** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి లో అందిన ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా భూ సర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలు, గృహ నిర్మాణ పథకాలు, వృద్ధాప్య పెన్షన్లు, మున్సిపాలిటీ ,పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై మొత్తం 90 దరఖాస్తులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు.ప్రతి ఒక్క ఫిర్యాదు దారిని యొక్క సమస్యను జిల్లా కలెక్టర్ శ్రద్ధగా విని, సమస్యల స్వభావాన్ని అర్థం చేసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన సూచనలు చేస్తూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన వినతులపై నిర్దిష్ట కాలపరిమితిలో స్పందిస్తూ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తగ్గించే దిశగా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్.పి. సీఈఓ, ఇంచార్జ్ డిపిఓ వెంకట్ రెడ్డి, ఆర్.డి.ఓ ఇ. నవీన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- ఐడీఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతో కలిసి ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరణ

**గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి)** ప్రజావాణికి ప్రతి వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 56 ఆర్జీలు వచ్చాయన్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్ లో ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణికి సంబంధించి 435 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. దరఖాస్తు దారులు అవసరమైన సందర్భాల్లో తమ ఆర్జీలకు సంబంధించిన రికార్డులు, ఇతర పత్రాలు తీసుకురాకుండా వస్తే ఆ సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోనూ వివిధ శాఖలకు సంబంధించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, ముఖ్యంగా రెవిన్యూ శాఖలో భూ సంబంధ సమస్యలపై వచ్చిన వందలాది ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు.

ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్ లో ఉన్న ఆర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు సైతం తమ పరిధిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి వచ్చిన ఆర్జీలను పరిష్కరిస్తే చిన్న చిన్న సమస్యలకే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, వారంలోగా షెడ్యూల్ ప్రకారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కార్యాలయాల గదుల్లో అనవసరమైన ఫర్నిచర్, ఫైల్స్ కనిపిస్తే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాలని, ప్రతి కార్యాలయం వద్ద బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పలు రంగాల్లో వెనుకబడిందని, జిల్లా పరిపాలన యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తేనే మన జిల్లా ఆయా రంగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలు, ఆసుపత్రులను తమ పరిధిలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తరచు సందర్శిస్తూ అక్కడి పనితీరు మెరుగుపడేందుకు సహకరించాలన్నారు. ఈ అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతోపాటు గురుకుల విద్యాలయాల్లో భోజనం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు. ప్రతి బుధవారం 11:00 గంటలకు పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ

**గద్వాల మార్చి 23 (వుదయం ప్రతినిధి)** పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షా కేంద్రంను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని సిద్ధంగా ఉంచి అవసరమైన విద్యార్థులకు అందజేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించ రాదని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలన్నారు. అనంతరం పలు తరగతి గదుల్లో తిరిగి విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## ద్రాక్ష తింటే ఒంట్లో జరిగేది ఇదే!



ఎరుపు, ఆకుపచ్చ, నలుపు.. ఇలా ద్రాక్షలోని మూడు రకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, వాటి ప్రయోజనాల విషయానికి వస్తే దాదాపు అన్నింటిలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఇవి వాపును తగ్గించి, కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. ద్రాక్షలో విటమిన్లు సి, కె ఉంటాయి. ఇవి ఫైబర్‌కు కూడా మంచి మూలం. వేసవి కాలంలో ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను విరివిగా తింటారు. అవి శరీరాన్ని తేమగా, తాజాగా ఉంచుతాయి. ఇలాంటి అద్భుతమైన జ్యూసీ పండ్లలో ద్రాక్ష ఒకటి. అనేక రంగులలో లభించే ద్రాక్షలు తీపిగా, పలుపుగా ఉంటాయి.. నలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగు ద్రాక్ష.. మూడు కూడా పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. అందుకే.. వీటిని తినాలని చెబుతున్నారు డైటీషియన్లు.. ద్రాక్షలను వైన్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు (రెస్వెరాట్రాల్).. ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాపర్, ఫోలేట్, విటమిన్లు సి, ఎ, కె, బి వంటి ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి.. రోగనిరోధక వ్యవస్థ కోసం ? ద్రాక్షలో విటమిన్ సి, విటమిన్ బి6, ఐరన్ ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. అందువల్ల, రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ద్రాక్షను రెగ్యులర్‌గా తినవచ్చు.మలబద్ధకాన్ని నివారిస్తుంది: ద్రాక్షలో పీచుపదార్థం బాగా ఉంటుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అలసటను ఎదుర్కోవడానికి: ద్రాక్షలో విటమిన్లు, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, రాగి ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించి, అలసటను తగ్గించడంలో సహాయపడతాయి. కళ్ళకు మేలు: ద్రాక్షలో ఉండే పాలిఫెనాల్స్ ? రెస్వెరాట్రాల్, మాక్యులర్ డీజెనరేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపు, శుక్లాలు వంటి కంటి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. ద్రాక్షను తినడం అంధత్వాన్ని నివారించడంలో కూడా సహాయపడవచ్చు. అందువల్ల, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ద్రాక్షను తినవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు..రక్తంలో చక్కెర నియంత్రణ : మధుమేహం ఉన్నవారికి ద్రాక్షపండ్లు కూడా మేలు చేస్తాయి. వాటికి మధుమేహ నిరోధక గుణాలు ఉన్నాయి.. అవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి : రు ద్రాక్షపండ్లను తినడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. ద్రాక్ష రసంలో ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. ఎముకలను బలపరుస్తుంది: ద్రాక్షలో రాగి, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచి, బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపొరోసిస్) ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

## ఈ చేప తింటే ఆ సమస్యలన్నీ మాయం

అధిక రక్తపోటు, మధుమేహం, కొవ్వు సమస్యలతో సతమతమవుతున్నారా? అయితే చేపల ప్రియుల కోసం ఒక శుభవార్త.. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. పండుగప్ప చేపను తినడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని తేలింది. నాన్‌వెజ్ ప్రియుల బాగా ఇష్టంగా తినేది చేపలు. చేపల పులుసు, చేపల ఫ్రై అంటే చాలా మందికి పిచ్చి. అయితే రు మార్కెట్‌కు వెళ్లే ముందు ఈ విషయం తెలుసుకోండి. రు బరువు తగ్గాలని చూస్తున్నారా? లేదా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలనుకుంటున్నారా? అయితే పండుగప్ప చేప ఆహారంలో ఉండాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు.



ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. కొడువా చేప కేవలం రుచిలోనే కాదు ఆరోగ్య ప్రయోజనాల్లోనూ మేటి అని తేలింది. ముఖ్యంగా రక్తపోటును నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. 2017-18లో పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నిర్వహించిన పరిశోధన ఫలితాలు గతేడాది విడుదలయ్యాయి. ఈ నివేదిక ప్రకారం.. పండుగప్ప చేప రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టమైంది. పండుగప్ప చేపలో ఉండే ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె జబ్బులు, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అంతేకాకుండా ఇందులోని ఒమేగా-3 ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. ఇది పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంతో మేలు చేస్తుంది. ఈ చేపలో విటమిన్-ఎ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడమే కాకుండా వృద్ధులలో వచ్చే కంటిశుక్లం సమస్యను ఆలస్యం చేస్తాయి. అలాగే ఇతర చేపలతో పోలిస్తే ఇందులో విటమిన్-డి అత్యధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి తోడ్పడుతుంది. బరువు తగ్గాలని కఠినమైన డైట్ ఫాలో అయ్యేవారికి ఈవా చేప ఒక గొప్ప వరం. 100 గ్రాముల పండుగప్ప చేపలో సుమారు 22 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది కండరాల బలానికి అవసరం. సాల్మన్ చేపతో పోలిస్తే ఇందులో కేలరీలు సగం మాత్రమే ఉంటాయి. అధిక ప్రోటీన్, తక్కువ కేలరీలు ఉండటం వల్ల ఇది శరీరంలో అదనపు కొవ్వును కరిగించి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది.

## వేసవిలో మజ్జిగ ఎక్కువగా తాగుతున్నారా?

వేసవికాలంలో చాలా మంది మజ్జిగ ఎక్కువగా తాగుతుంటారు. కొందరు సాధారణ మజ్జిగ తాగుతారు. మరికొందరు జీలకర్ర, ఇతర మసాలాలు, సుగంధ ద్రవ్యాలు కలిపి మసాలా మజ్జిగ తాగుతారు. కొందరు భోజనం తర్వాత, మరికొందరు రాత్రి భోజనం తర్వాత మజ్జిగ తాగుతారు. కానీ అందరూ మజ్జిగ తాగడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరి శరీరంలో తలెత్తే సమస్యలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి, సాధారణంగా మజ్జిగ తాగడానికి బదులుగా, మజ్జిగ తాగేటప్పుడు కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆయుర్వేదంలో, మజ్జిగ తీసుకోవడం ప్రతి వ్యక్తి శరీర స్వభావాన్ని బట్టి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు, వాత స్వభావం ఉన్నవారు మజ్జిగ తాగే ముందు కొన్ని మార్పులు చేసుకోవాలి. వాత స్వభావం ఉన్నవారు నేరుగా చల్లని మజ్జిగ తాగే బదులు 1 చిటికెడు ఉప్పు కలిపి మజ్జిగ తాగాలి. ఇలా చేయడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. తరచుగా మజ్జిగ తాగిన వెంటనే టాయిలెట్‌కు వెళతారు. ఉప్పు లేదా నల్ల ఉప్పుతో మజ్జిగ తాగడం వల్ల తరచూ మూత్రానికి వెళ్లే వారికి సమస్య తగ్గుతుంది. ఇలా చేస్తే జీర్ణక్రియ బలంగా ఉంటుంది. సరిగ్గా తీసుకుంటే, వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలను సమతుల్యం చేయడంలో మజ్జిగ ప్రయోజనకరంగా ఉంటుంది. పిత్త స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: పిత్త స్వభావం ఉన్నవారు చిటికెడు గ్రాన్యులేటెడ్ చక్కెరతో కలిపి మజ్జిగ తాగాలి. పిత్తాశయ రాళ్ళు శరీరంలో వేడిని సృష్టిస్తాయి. వాపు, ఆమ్లత్వాన్ని కలిగిస్తాయి. మజ్జిగ, గ్రాన్యులేటెడ్ చక్కెర మిశ్రమం శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది మంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగను ఎలా తాగాలి?: కఫ స్వభావం ఉన్నవారు మజ్జిగలో చిటికెడు సుంఠను కలిపి తాగాలి. ఇది మజ్జిగ తాగిన వెంటనే కఫం బయటకు రాకుండా చేస్తుంది. గొంతు నొప్పి, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తవు, జీర్ణక్రియ మందగించదు. ఆయుర్వేదం ప్రకారం, ఏదైనా పానీయం లేదా ఆహార పదార్థం, ప్రభావం ఏ వ్యక్తిపైనా ఒకేలా ఉండదు. సరిగ్గా తీసుకుంటే, ఏదైనా ఆహార పదార్థం ఔషధంలా పనిచేస్తుంది. అందువల్ల, శరీర లోపాలు, ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా ఇది జీర్ణక్రియను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.



## ఆరోగ్యానికి ఏది మంచిది..?

ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడంతో డైట్ చార్ట్‌లో సూపర్ ఫుడ్స్ హవా కొనసాగుతోంది. ముఖ్యంగా చియా సీడ్స్, గుమ్మడి గింజలు పోషకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. అయితే బరువు తగ్గాలనుకునే వారు దేనిని ఎంచుకోవాలి? కండరాల పుష్టి కోసం ఏది మేలు చేస్తుంది? ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చనే అవగాహన అందరిలోనూ వస్తోంది. ఈ క్రమంలోనే సూపర్ సీడ్స్‌గా పిలిచే చియా గింజలు, గుమ్మడి గింజలు నేడు ప్రతి ఒక్కరి కిచెన్ డైట్‌లో భాగమవుతున్నాయి. అయితే ఈ రెండింటిలో ఏది శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. వాస్తవానికి ఈ రెండు గింజలు పోషకాల గనులే అయినప్పటికీ, వాటి పనితీరు, ప్రయోజనాలు వేర్వేరుగా ఉంటాయి. రు బరువు తగ్గాలని లేదా జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే చియా సీడ్స్ అద్భుతమైన ఎంపిక. వీటిలో గుమ్మడి గింజల కంటే సుమారు ఐదు రెట్లు ఎక్కువ ఫైబర్ ఉంటుంది. ఈ పీచు పదార్థం వల్ల ఆహారం తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. తద్వారా అనవసరమైన ఆకలి తగ్గుతుంది. అంతేకాకుండా చియా గింజలు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియానికి ప్రధాన వనరులు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఎముకల దృఢత్వానికి కూడా తోడ్పడతాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇవి ఎంతగానో సహకరిస్తాయి.



మరోవైపు కండరాల బలం, మానసిక ప్రశాంతత కోరుకునే వారికి గుమ్మడి గింజలు సరైన తోడుగా నిలుస్తాయి. చియా గింజలతో పోలిస్తే వీటిలో ప్రోటీన్ శాతం చాలా ఎక్కువ. శరీర కణాల మరమ్మత్తుకు, కండరాల నిర్మాణానికి ఈ ప్రోటీన్ అత్యవసరం. అన్నింటికంటే ముఖ్యంగా గుమ్మడి గింజల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడమే కాకుండా నరాలు, కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది. రాత్రిపూట నిద్ర లేమితో బాధపడేవారు ఈ గింజలను తీసుకోవడం వల్ల వీటిలోని ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ వల్ల ప్రశాంతమైన నిద్ర పడుతుంది. వీటిలో ఉండే జింక్ మరియు విటమిన్-ఇ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా మారుతాయి.

చివరగా ఈ రెండింటిలో ఏదో ఒకదానికే పరిమితం కాకుండా రెండింటినీ దైనందిన ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల కు ఫైబర్, ప్రోటీన్, మెగ్నీషియం, ఒమేగా-3 వంటి అన్ని రకాల పోషకాలు సమతుల్యంగా అందుతాయి. అయితే తీసుకునే విధానంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. చియా గింజలను ఎప్పుడూ నేరుగా పొడిగా తినకూడదు వాటిని నీటిలో లేదా స్మూతీస్ వంటి ద్రవ పదార్థాల్లో కనీసం 20 నిమిషాలు నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. గుమ్మడి గింజలను పచ్చిగా లేదా దోరగా వేయించి స్నాక్స్‌లా తీసుకోవచ్చు. శరీర అవసరాలను బట్టి ఈ సూపర్ సీడ్స్‌ను డైట్‌లో భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండి.

## అందానికి ఆముదం!

అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ రకాల సౌందర్యోత్పత్తుల్ని ప్రయత్నిస్తుంటారు అమ్మాయిలు. అయితే ఇంట్లో అందుబాటులో ఉండే ఆముదం కూడా సౌందర్య సంరక్షణకు తోడ్పడుతుందని చెబుతున్నారు నిపుణులు. మరి, దాన్నెలా వాడాలో తెలుసుకుందాం రండి.. ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు ఒక చుక్క ఆముదాన్ని పెదవులకు రాసుకుంటే కొద్ది రోజుల్లోనే అధరాలు అందంగా మారతాయట. ఇలా ఆముదం సహజసిద్ధమైన లిప్‌బామ్‌గా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. కొంతమంది గోళ్లు కాస్త పెరగ్గానే విరిగిపోతుంటాయి. ఈ సమస్య ఉన్న వారు రోజూ పడుకునే ముందు ఆముదంతో గోళ్లను పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఇలా కొద్ది రోజుల పాటు చేయడం వల్ల గోళ్లు దృఢంగా మారి విరిగిపోకుండా జాగ్రత్తపడచ్చు. అంతేకాదు.. రోజూ ఆముదం రాసుకోవడం వల్ల గరుకుగా ఉన్న చర్మం కూడా మృదువుగా మారుతుందట. రోజూ ఆముదం రాసుకోవడం వల్ల చర్మానికి తగినంత తేమ అందుతుంది. ఫలితంగా చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మం ముడతలు పడకుండా చేసే గుణాలూ ఆముదంలో బోలెడున్నాయి. అందుకే దీన్ని 'యాంటీ ఏజింగ్' చికిత్సల్లో కూడా ఉపయోగిస్తారంటున్నారు నిపుణులు. కొంతమంది అమ్మాయిలకు కనుబొమ్మలు, రెప్పలు చాలా పలుచగా ఉంటాయి. ఇలాంటివారు రోజూ రాత్రి పడుకునే ముందు ఆముదాన్ని రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే ఆముదం అందాన్ని ద్విగుణీకృతం చేసేదే అయినా.. మితంగా వాడడం, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం తప్పనిసరి! అలాగే గర్భిణులు, పాలిచ్చే తల్లులు దీనికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు.



## మంచిదని ఫుల్లుగా తాగుతున్నారా..?

అతిగా నీరు తాగడం మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. తరచుగా మూత్రవిసర్జన, వాపు, తలనొప్పి వంటి లక్షణాలు అధిక హైడ్రేషన్‌ను సూచిస్తాయి. వయస్సు, బరువు, శారీరక శ్రమను బట్టి రోజుకు 2-3 లీటర్లు తాగడం సరిపోతుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాల కోసం సమతుల్య జీవనశైలి అవసరం. రు ఎంత ఎక్కువ నీరు తాగితే అది శరీరానికి, పిండాలకు అంత మంచిదని చాలా మంది నమ్ముతారు.. ఇలానే రోజు మొత్తంలో ఎక్కువ నీరు తాగుతారు.. అయితే.. మూత్రపిండాల పని రక్తాన్ని శుభ్రపరచడం, శరీరం నుండి అవసరమైన, విషపూరిత పదార్థాలను వేరు చేయడం.. మూత్రం ద్వారా వాటిని విసర్జించడం. మనం తాగే నీరు ఈ ప్రక్రియలో సహాయపడుతుంది. కానీ నీటిని అధికంగా వినియోగించినప్పుడు, అది మూత్రపిండాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది.. శరీర సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల తరచుగా మూత్ర విసర్జన, వాపు, తలనొప్పి , అలసట, వికారం, కొన్నిసార్లు తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందికి చేతులు, కాళ్ళు బరువుగా ఉండటం, నిద్ర పట్టడంలో ఇబ్బంది కలగవచ్చు. ఈ సంకేతాలు శరీరం అవసరమైన దానికంటే ఎక్కువ నీటిని తీసుకుంటున్నట్లు సూచిస్తాయి. ఢిల్లీ ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీని గురించి సవివరంగా వివరించారు. ఒక వ్యక్తి నిరంతరం అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు, మూత్రపిండాలు దానిని పదే పదే ఫిల్టర్ చేయాల్సి వస్తుంది. ఇది మూత్రపిండాల సామర్థ్యంపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. అధిక నీరు శరీరంలోని ఉప్పు, ఇతర ఎలక్ట్రోలైట్‌ల సమతుల్యతను దెబ్బతీస్తుంది.. దీని వలన సోడియం స్థాయిలు తగ్గుతాయి. ఈ స్థితిలో, కణాలలో నీరు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది, ఇది మెదడు, కండరాలకు హానికరం కావచ్చు. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, మూత్రం చాలా పాలిపోయినట్లు కనిపించడం లేదా తరచుగా మూత్రవిసర్జన చేయడం కూడా ఒక సంకేతం కావచ్చు. ఇది చాలా కాలం పాటు కొనసాగితే, ఇప్పటికే బలహీనమైన మూత్రపిండాలు ఉన్నవారిలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందువల్ల, ఎక్కువ నీరు త్రాగడం వల్ల మూత్రపిండాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది.. అని వివరించారు. నీటి అవసరాలు ప్రతి వ్యక్తికి ఒకేలా ఉండవు. అవి వయస్సు, బరువు, వాతావరణం, శారీరక శ్రమ, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా, రోజుకు 2 నుండి 3 లీటర్ల నీరు సరిపోతుందని భావిస్తారు. వేడి వాతావరణంలో లేదా మీరు అధికంగా చెమట పట్టినట్లయితే ఈ మొత్తాన్ని కొద్దిగా పెంచవచ్చు. దాహం వేసినప్పుడు నీరు త్రాగడం, మూత్రం రంగును గమనించడం సులభమయిన మార్గం.. లేత పసుపు రంగు సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మూత్రం స్పష్టంగా, తరచుగా వస్తూ ఉంటే, అది అధిక హైడ్రేషన్‌కు సంకేతం కావచ్చు. వైద్యుడిని సంప్రదించకుండా రు ఎక్కువ నీరు తాగే అలవాటును పెంచుకోకూడదు. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీరు మాత్రమే కాదు, సమతుల్య జీవనశైలి కూడా అవసరం. ఉప్పు తీసుకోవడం పరిమితం చేయండి.. వేయించిన ఆహారాలను నివారించండి. క్రమం తప్పకుండా భోజనం చేయండి.. తగినంత నిద్ర పొందండి.



## కోమలమైన చర్మానికి..!

వాతావరణం ఎలా ఉన్నా సరే.. కొందరి చేతులు, కాళ్లు పొడిబారి పగులుతుంటాయి. ఇలాంటప్పుడు ఈ సింపుల్ చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు. కాళ్లు, చేతులపై మృతకణాలు పేరుకున్నప్పుడు కూడా చర్మం పొడిబారి నిర్జీవంగా కనిపిస్తుంది. అందుకే వాటిని తొలగించుకునేందుకు ఇంట్లో తయారుచేసుకునే కొన్ని ప్యాక్స్, స్క్రబ్స్ అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుంది. చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. రాత్రి పడుకునే ముందు



కొబ్బరినూనెను చేతులు, కాళ్లు, పాదాలకు రాసుకొని మర్దన చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల పొడిబారిన చర్మం తిరిగి మృదువుగా మారుతుందట. గోరువెచ్చని నీటిలో కొద్దిగా వంటసోడా, ఏదైనా కొన్ని చుక్కల అత్యవసర నూనెను వేయాలి. కొన్ని గులాబీ రేకలూ వేసుకోవచ్చు. ఇందులో చేతులు, కాళ్లను ఓ పది నిమిషాల పాటు ఉంచి తీసేయాలి. ఇలా చేయడం వల్ల కాళ్లు, చేతుల చర్మం మృదువుగా మారుతుందంటున్నారు నిపుణులు. గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఎప్సమ్ సాల్ట్ వేసుకుని అందులో చేతులు, కాళ్లను కాసేపు ఉంచాలి. పదినిమిషాల తర్వాత బయటికి తీసి కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆయా భాగాలకు తేమ అందుతుందట.

## కాళ్ల నొప్పులు తగ్గాలంటే...

ముప్పైలు దాటిన మహిళలు ఎదుర్కొనే సమస్యల్లో కాల్షియం లోపం ఒకటి. ఇది కాళ్లు, మోకాళ్ల నొప్పులు, ఎముకల అరుగుదల వంటి అనేక సమస్యలకు దారితీస్తుంది. మెనోపాజ్ తర్వాత ఆస్టియో పోరోసిస్ ముప్పు అధికమవుతుంది. మరి వీటి ప్రభావాన్ని తగ్గించుకోవడానికి కాల్షియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా పాలు, పాల ఉత్పత్తులను ఆహారంలో భాగం చేసుకోవాలి. శాకాహారులు చీజ్, పనీర్, బాదం వంటివి తీసుకోవడం వల్ల కావలసినంతగా ఈ విటమిన్‌ని భర్తీ చేసుకోవచ్చు. ఒకవేళ పాల పదార్థాలు పడకపోతే... ఓ కప్పు ఉడికించిన పాలకూరని ఎంచుకుంటే సరి. మీ రోజువారీ అవసరంలో కనీసం 25శాతం భర్తీ చేస్తుంది ఇది. రోజూ గుడ్డు తింటే... కాల్షియం, విటమిన్-డి కొంత మేర లభిస్తుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. మిగిలిన దానికోసం ఎండ తగిలేలా ఓ గంటపాటు తోటలో గడపండి. అయితే, కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకున్నాక ఓ గ్లాసు బత్తాయి రసం తాగండి. ఇందులోని విటమిన్ సి ఆ పోషకాన్ని శోషించగలిగే శక్తిని శరీరానికి ఇస్తుంది.



## ఒక్క మార్చిలోనే రూ. 93 వేల కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి



భారతకరెన్సీ క్రమం తప్పకుండా రికార్డుస్థాయి కనిష్టాలకు బలహీనపడుతుండటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులు వెనక్కి తీసుకెళ్తున్నారు.వీటితో పాటు పెరుగుతున్న ముడిచమురు ధరలు దేశ మౌలిక సదుపాయాలకు ముప్పుగా పరిణమించాయి. దీనితో స్టాక్ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)షేర్ల అమ్మకాలు ఈనెలలో రికార్డుస్థాయిలో నమోదవుతున్నాయి. ఎన్ఎస్‌డీఎల్,బీఎస్ఈ సంయుక్త డేటాప్రకారం, ఇప్పటివరకు విదేశీపోర్ట్‌ఫోలియోఇన్వెస్టర్లు కేవలం స్టాక్‌మార్కెట్ల నుంచే రూ.93,698కోట్లను ఉపసంహరించుకున్నారు.




## ప్రపంచ వ్యాప్త ద్రవ్యోల్బణ సెగలే..!




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఎగిసే అవకాశం ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే మరింత ద్రవ్యోల్బణ అలజడికి కారణం కావచ్చని హెచ్చరించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచ ఇంధన రంగం, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు భారత్‌పై పెద్ద ప్రభావం చూపకపోవచ్చని తప్పుదు తడకగా రిపోర్ట్ ఉండటం గమనార్హం. బ్యారెల్ చమురు ధర 110 డాలర్లు దాటడంతో భారత ఇంధనం, రవాణపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గ్యాస్ కొరతతో అనేక కంపెనీలు మూతపడుతున్నాయి. మరోవైపు యుద్ధం ప్రభావంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ కనిష్టం 94 చేరువలో నమోదయ్యింది. ఎగుమతులు పడిపోతున్నాయి. అయినప్పటికీ యుద్ధ ప్రభావం అంతంతే అంటూ ఎస్‌బిఐ నివేదిక పేర్కొనడం సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో అస్థిరత ఏర్పడవచ్చని రిపోర్ట్ పేర్కొంది. ఒకవేళ ఈ సంఘర్షణ దీర్ఘకాలం కొనసాగితే.. ముడి చమురు ధర ప్రతీ 10 డాలర్లు పెరిగినప్పుడు.. భారత కరెంట్ అకౌంట్ లోటు (సిఏడి) 36 బేసిస్ పాయింట్లు, ద్రవ్యోల్బణం 35-40 బేసిస్ పాయింట్లు పెరిగే ప్రమాదం ఉందని నివేదిక అంచనా వేసింది.

## ఎయిర్‌లైన్స్‌కు లిక్విడిటీ మద్దతు ఇచ్చే అవకాశం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, పెరుగుతున్న ఇంధన ధరల వల్ల కార్యకలాపాల అంతరాయాలు విమానయాన రంగాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విమానయాన సంస్థలకు లిక్విడిటీమద్దతు ఇవ్వాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం పన్ను ఉపశమన అవకాశాలను కూడా పరిశీలిస్తోందని, ఈ సమస్యపై చర్చించడానికి రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతుందని వెల్లడించారు. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి విమానయాన సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా, పాకిస్తాన్ గగనతలాలు మూసివేత కారణంగా ఫ్లైట్ రూట్లు పెరిగాయి.

# తిరుగులేని శక్తిగా భారత్...
## అమెరికా మ్యాగజైన్ వెల్లడి




గత కొన్నేళ్లుగా భారత ఆర్థికవ్యవస్థ అత్యంత వేగవంతమైన వృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా మన దేశ ఆర్థిక వృద్ధిని ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన మ్యాగజైన్ 'వాషింగ్టన్ ఎగ్జామినర్' భారత్‌కు సంపన్న దేశంగా ఎదిగే సామర్థ్యం అత్యధికంగా ఉందని అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే 2047 నాటికి ఇది సాధ్యమని మ్యాగజైన్ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా ప్రపంచదేశాలు భారత్‌ను ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా చూస్తున్నాయని వెల్లడించింది. వాషింగ్టన్ ఎగ్జామినర్ నివేదిక కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రధానంగా గడిచిన రెండు దశాబ్దాలను పరిగణలోకి తీసుకుని, 2003 నుంచి దేశ ఆర్థికవ్యవస్థ సగటు వార్షిక వృద్ధి రేటు 7 శాతానికి పైగా ఉందని పేర్కొంది. రాబోయే మరో 20ఏళ్ల వరకు ఇదే వృద్ధి వేగాన్ని కొనసాగిస్తే దేశ తలసరి జీడీపీ 15,000 డాలర్లను దాటుతుంది. తద్వారా భారత్ అధిక-ఆదాయ పరిమితిని దాటేస్తుంది. దీనివల్ల భారత్ మిడిల్-ఇన్‌కమ్ ట్రాప్ నుంచి బయటపడుతుంది. ఈ స్థాయి వృద్ధితో మధ్య-ఆదాయ ట్రాప్‌లో చిక్కుకున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా, తుర్కియే వంటి ఆర్థిక వ్యవస్థలను భారత్ అధిగమించే అవకాశాలు ఉన్నాయి. భారతదేశ వృద్ధి అవకాశాలకు అనుకూలంగా అధిక జనాభా, పెరుగుతున్న సాంకేతికత వినియోగం, పాలసీలు వంటివి మద్దతునిస్తున్నాయని వాషింగ్టన్ ఎగ్జామినర్ తెలిపింది. ముఖ్యంగా యువత భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం. అమెరికా, చైనాల కంటే భారత్‌లో ఎక్కువ యువత ఉంది. వచ్చే దశాబ్దాల్లో గణనీయమైన సంఖ్యలో యువత శ్రామిక శక్తిలో ప్రవేశించనుంది. దీనివల్ల ఉత్పాదకత పెరుగుతుంది. ఈ ధోరణి పటిష్టమైన దేశీయ మార్కెట్‌ను ఇస్తుంది. వృద్ధి కోసం ఎగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండదు. ఈ ప్రయోజనాలను పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ప్రస్తుతం దేశంలో రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ కారిడార్ల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఫలితంగా దేశంలో మరింత సమర్థవంతమైన రవాణా వ్యవస్థ సరఫరాను బలోపేతం చేస్తుందని నివేదిక వివరించింది.

## అమెరికాకు నిలిచిన మసాలా ఎగుమతులు




అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధోన్మాదం భారత ఎగుమతులను తీవ్ర ప్రభావితం చేస్తోంది. భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు స్తంభించాయి. భారత్ నుండి ఏటా సుమారు 500 మిలియన్ డాలర్ల విలువైన మసాలా దినుసులు అమెరికాకు ఎగుమతి అవుతుండగా.. ప్రస్తుత అనిశ్చితి వల్ల అక్కడి కొనుగోలు దారులు కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా నవంబర్ నెలలో ఎగుమతి దారులు, కొనుగోలు దారులు ప్రాథమిక ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం షిప్పింగ్ మార్గాల్లో అంతరాయం, పెరిగిన బీమా ప్రీమియంలు, యుద్ధ రిస్క్ సర్‌ఛార్జీల కారణంగా కొనుగోలు దారుల నుండి ఎటువంటి స్పందన రావడం లేదని ఎగుమతి దారులు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మసాలా దిగుమతుల సాగు విస్తీర్ణం 5.09 మిలియన్ హెక్టార్లకు లేదా 1.4 శాతం పెరిగి ఉత్పత్తి 12.99 మిలియన్ టన్నులకు చేరుకున్నప్పటికీ, ఎగుమతులు నిలిచిపోవడంతో దేశీయంగా మిగులు నిల్వలు పెరిగి ధరలు పడిపోయే ప్రమాదం ఉందని ఈ రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మిరియాలు, యాలకులు, మిరపకాయలు, ధనియాలు, కరివేపాకు పొడి వంటి ఉత్పత్తుల ఎగుమతులపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా ఖర్చులు భారీగా పెరగడం మరియు కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికా కొనుగోలుదారుల నుండి ఎటువంటి ఆర్డర్లు లేవు.

## ఓఎఫ్ఎస్ మార్గంలో ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయం!




ఎల్ఐసీ నియంత్రణలోని ఐడీబీఐ బ్యాంక్‌లో కొంత వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయించడం ద్వారా పబ్లిక్ షేర్ హోల్డింగ్ పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో పబ్లిక్ వాటా 5.29 శాతం మాత్రమే ఉంది. మిగతా షేర్లలో ఎల్ఐసీ వద్ద 49.24 శాతం, ప్రభుత్వంవద్ద 45.48 శాతం వాటాలున్నాయి. ఈ నెల ప్రారంభంలో ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి తమ వద్ద ఉన్న వాటాల్లో 60.72 శాతాన్ని విక్రయించేందుకు ఆర్థిక బిడ్లను ఆహ్వానించాయి. అయితే ఇద్దరు కొనుగోలుదార్ల నుంచి వచ్చిన బిడ్లు రిజర్వ్ ధర కంటే తక్కువగా ఉండటంతో విక్రయ ప్రతిపాదనను రద్దు చేశాయి. ఫ్రీ-ఫ్లోట్ మార్కెట్ తక్కువగా ఉండటంతో బ్యాంక్ సరైన మార్కెట్ విలువ బయటకు రావడం లేదని, ప్రస్తుతం ఉన్న 5.29 శాతం పబ్లిక్ వాటాను 10 లేదా 15 శాతానికి పెంచడం ద్వారా కచ్చితమైన షేరు విలువను వెలికి తీయొచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రద్దు చేసిన విక్రయ ప్రతిపాదన ప్రకారం.. ప్రభుత్వం, ఎల్ఐసీ తమ వద్ద ఉన్న 30.48 శాతం, 30.24 శాతం వాటాలను తగ్గించుకోవాలని భావించాయి. దీంతో ఓఎఫ్ఎస్ అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# 1,481 పాయింట్లు పతనమైన సెన్సెక్స్




భారతీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల లోని ప్రతికూల పవనాలకు తోడు దేశీయంగా నెలకొన్న ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం ఉదయం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,481.95 పాయింట్లు పతనమై 73,051.01 వద్ద ట్రేడవుతుండగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 415.95 పాయింట్లు కోల్పోయి 22,698.55 వద్ద కొనసాగుతోంది. ఈ ఆకస్మిక పతనంతో ఇన్వెస్టర్ల సంపద లక్షల కోట్లలో ఆవిరైపోయింది. మార్కెట్ పతనానికి మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ మేఘాలే ప్రధాన కారణంగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్ర రూపం దాల్చడంతో గ్లోబల్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. ఇరాన్ తన ఇంధన వనరులపై దాడులు జరిగితే ప్రతిఘటిస్తామని హెచ్చరించడం, మరోవైపు అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉండటంతో ముడిచమురు ధరలు మళ్ళీ బ్యారెల్‌కు వి112 దాటాయి. ఇది భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల్లో ద్రవ్యోల్బణ భయాలను పెంచింది. మరోవైపు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఈఎఎబ) భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను ఉపసంహరించుకోవడం మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. గ్లోబల్ రిస్క్ పెరగడంతో ఇన్వెస్టర్లు సురక్షితమైన బాండ్లు, బంగారం వైపు మళ్లుతున్నారు. దీనికి తోడు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 93.83 వద్ద ఆల్‌మ్ కనిష్టానికి పడిపోవడం కూడా మార్కెట్ కుప్పకూలడానికి ఒక ముఖ్య కారణమైంది.

బ్యాంకింగ్ మరియు ఐటీ రంగానికి చెందిన దిగ్గజ షేర్లు భారీగా నష్టపోవడంతో సూచీలు కోలుకోలేక పోయాయని నిపుణులు తెలుపుతున్నారు.




## మహిళల క్యాండిడేట్స్ టోర్నీ..వైదొలగిన హంపి



ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి వైదొలగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. సైప్రస్‌లోని పఫోస్‌లో ఈ నెల 28న క్యాండిడేట్స్ టోర్నీ ఆరంభం కానుంది. వ్యక్తిగత భద్రతపై ఆందోళనకారణంగా హంపి ఈటోర్నీకి దూరమైంది. ''బాగా ఆలోచించాక కఠిన నిర్ణయం తీసుకున్నా. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నా. ఎంత ముఖ్య మైన ఈవెంనా వ్యక్తిగత భద్రత తర్వాతే. నిర్వాహకులు హా ఇచ్చినా.. ప్రస్తుత పరిస్థితుల్లో నాకు భద్రతాభావం కలగట్లేదు. ఇది బాధాకర నిర్ణయమే. కానీ తప్పట్లేదు'' అని హంపి ఎక్స్‌లో పేర్కొంది. క్యాండిడేట్స్ నుంచి వైదొలగాలని భావిస్తున్నట్లు హంపి ఇంతకుముందే చెప్పింది. పురుషుల, మహిళల క్యాండిడేట్స్ టోర్నీలు సైప్రస్‌లో ఒకేసారి జరగనున్నాయి.

## ఆకాష్ దీప్ స్థానంలో కేకేఆర్ జట్టులోకి సౌరభ్ దూబే



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే అనేక జట్లకు ఊహించని షాక్ తగులుతోంది. పలువురు ప్లేయర్లు గాయాల కారణంగా జట్టుకు దూరం అవుతుండగా పలువురు విదేశీ ప్లేయర్లు ఔఅ లభించకపోవడంతో ఈ సీజన్ కు అందుబాటులోకి రావడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఐఐఖీ) జట్టుకు సైతం కీలక ప్లేయర్ దూరం అయ్యాడు. దీంతో ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే ఐఐఖీ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా జట్టుకు దూరమైన టీమిండియా పేసర్ ఆకాష్ దీప్ స్థానంలో, విదర్భ కు చెందిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ సౌరభ్ దూబేను తీసుకోవాలని కేకేఆర్ యాజమాన్యం నిర్ణయించింది. 28 ఏళ్ల సౌరభ్ దూబే గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఐపీఎల్‌లో అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. ప్రస్తుతం కేకేఆర్ క్యాంప్‌లో చేరుతున్న ఆయనపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ఈమార్పుకు సంబంధించి కేకేఆర్ ఫ్రాంచైజీ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఖాళీ స్టేడియాల్లోనే పాకిస్థాన్ సూపర్ లీగ్ మ్యాచ్‌లు




అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ యుద్ధం కారణంగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ కారణంగా పాకిస్థాన్‌లో తీవ్రమైన ఇంధన కొరత ఏర్పడటంతో ఆ ప్రభావం పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 తీవ్రంగా పడింది. దీంతో 2026 సీజన్‌పై పీసీబీ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా పొదుపు చర్యలు అమలులో ఉన్నందున, ప్రజల రాకపోకలను తగ్గించేందుకు ప్రారంభ మ్యాచ్‌లను ఖాళీ స్టేడియాల్లో నిర్వహించనున్నట్లు పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఆదివారం ప్రకటించారు. అంతేకాకుండా, గతంలో ఆరు నగరాల్లో నిర్వహించాలని ప్లాన్ చేసినప్పటికీ, వనరులను ఆదా చేసేందుకు ఇప్పుడు కేవలం లాహోర్, కరాచీ నగరాలకు మాత్రమే వేదికలను పరిమితం చేశారు. లాహోర్‌లో వైభవంగా జరగాల్సిన ప్రారంభ వేడుకను కూడా బోర్డు రద్దు చేసింది. మార్చి 26 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో, పరిస్థితులు మెరుగు పడే వరకు ప్రేక్షకులను అనుమతించబోమని నఖ్వీ స్పష్టం చేశారు. ఒకవైపు ప్రజలను ప్రయాణాలు తగ్గించుకోవాలని కోరుతూ, మరోవైపు స్టేడియాలకు వేల సంఖ్యలో రావాలని పిలవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే టికెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు 72 గంటల్లోపు పూర్తి నగదును రీఫండ్ చేస్తామని, ఫ్రాంచైజీలకు జరిగే ఆదాయ నష్టాన్ని బోర్డు భరిస్తుందని హా ఇచ్చినట్లు తెలుస్తుంది. కాగా, ఇదే సమయంలో ఐపీఎల్ కోసం పిఎస్ఎల్ ఒప్పందాలను కాదనుకున్న విదేశీ ఆటగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీ బోర్డు హెచ్చరించింది.

## దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ గెలుపు

న్యూజిలాండ్ మహిళల జట్టు టి-20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెల్లింగ్టన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో టి-20లో కివీస్ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఓ మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి159 పరుగులు చేసింది. సౌతాఫ్రికా ఆల్ రౌండర్ అనేరీ డెర్క్సెన్ మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 32 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 55 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెతోపాటు లాస్ 30 పరుగులతో ఆకట్టుకుంది. ఇక కివీస్ బౌలర్లలో జెస్ కెర్ 3 వికెట్లతో అదరగొట్టింది. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. కేవలం 34 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 పరుగులు చేసింది. డివైన్‌తో పాటు అలియా కేర్ 29 బంతుల్లో 31 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో క్లో ట్రయాన్ 2 వికెట్లు సాధించింది. అన్నేరీ డెర్క్సెన్, మ్లబా చెరో వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును జెస్ కెర్ అందుకుంది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు ఐదో టి-20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా మార్చి 25న జరగనుంది.



## నేను 60 ఏండ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు




సీఎస్‌కే దిగ్గజ ఆటగాడు, మిస్టర్ కూల్ ఎంఎస్ ధోనీ తన రిర్మెంట్‌పై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఐపీఎల్‌లో 60 ఏళ్ల వయసు వచ్చినా ఆడుతూనే ఉంటానేమోనంటూ ఆయన చేసిన సరదా వ్యాఖ్యలు చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాయి. ప్రస్తుతం 44 ఏండ్ల వయసులో ఉన్న ధోనీ, తన భవిష్యత్తు ప్రణాళికలపై జరుగుతున్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలతో మరింత ఆసక్తిని జోడించారు. చెపాక్‌లో నిన్న జరిగిన సీఎస్‌కే ఫ్యాన్ ఈవెంట్‌లో ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన నటుడు శివకార్తికేయన్, రిర్మెంట్ ఆలోచనలు పక్కనపెట్టి మరికొన్నేళ్లు సీఎస్‌కే పసుపు జెర్సీలో కొనసాగాలని ధోనీని కోరారు. దీనికి ధోనీ నవ్వుతూ బదులిస్తూ? ''ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంది. అయినా కంగారు పడకండి? నేను 60 ఏండ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు'' అని అన్నారు. ఈ మాటలకు స్టేడియంలోని అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ వీడియో సోషల్ డియాలో వైరల్‌గా మారింది.

## అతడు రాణిస్తే చూడాలని ఉంది.. కానీ..: రవిచంద్రన్ అశ్విన్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ ప్రారంభం కావడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉంది. ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీలు ఐపీఎల్ ట్రోఫీ సాధించేందుకు తమ తమ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి.ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు గురించి మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో రాణిస్తే చూడాలని ఉందని అశ్విన్ అన్నాడు. వైభవ్ విజృంభిస్తే.. రాజస్థాన్‌ను ఎవరూ ఆపలేరని పేర్కొన్నాడు.'ఒకవేళ వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో విజృంభిస్తే.. రాజస్థాన్‌ను ఆపడం ఎవరి తరం కాదు. అయితే అతడికిది కేవలం రెండో సీజన్ మాత్రమే. ఆ పిల్లవాడికి సరైన అనుభవమూ లేదు. కాబట్టి అతడి ద ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదు'' అని అశ్విన్ అన్నాడు. అయితే వైభవ్‌ను అడ్డుకొనేందుకు అన్ని జట్లు ఇప్పటికే పక్కా ప్రణాళికను సిద్ధం చేసి బరిలోకి దిగుతాయని అశ్విన్ విశ్లేషించాడు. 'వైభవ్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. అండర్ 19 ప్రపంచకప్, గత ఐపిఎల్ సీజన్‌లో ఆడినట్లే ఈ సీజన్‌లో కూడా అతడు రాణిస్తే చూడాలని ఉంది. మొదటి బంతి నుంచే అతడు విధ్వంసం సృష్టించాలని కోరుకుంటున్నాను. అయితే ఈ సీజన్‌లో అతడిని కట్టడి చేసేందుకు ఇతర జట్లు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉంటాయి' అని అశ్విన్ తెలిపాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## ఈ నెలాఖరుకు "అహోం" ప్రారంభం

ఈగల్ ఐ స్టూడియో పతాకం పై ప్రసాద్ రాజు స్వీయ దర్శకత్వంలో "అహోం "అనే చిత్రం ఈ నెలాఖరుకు ప్రారంభం కానుంది. ప్రముఖ హీరోయిన్ నటిస్తున్న ఈ చిత్రంలో నటీనటుల ఎంపిక ప్రస్తుతం జరుగుతోంది. పాత కొత్త నటీనటులతో ఈ చిత్రం తెరకెక్కనుంది.



## గాయపడ్డ సింహం
# కాన్సెప్ట్ చాలా బావుంది




డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ – డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫన్ ఫిల్డ్ ట్రైజర్, న్ ప్రమోషనల్ ర్యాప్ సాంగ్ కు కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ ప్రాజెక్ట్‌కు మరింత బలాన్ని చేకూరుస్తూ, దిల్ రాజు థియేట్రికల్ హక్కులను కొనుగోలు చేసి, ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి, విష్ణు ఓయ్, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో నటించారు. చిత్రానికి స్ట్రాంగ్ టెక్నికల్ టీం పనిచేసింది. విద్యా సాగర్ చింత సినిమాటోగ్రాఫర్, స్వీకర్ అగస్తి సంగీత దర్శకుడు, ప్రొడక్షన్ డిజైనర్ చంద్రిక గొర్రెపాటి, సూర్య ప్రకాష్ జోస్యుల కథను అందించారు.

### కాన్సెప్ట్ నచ్చి వరల్డ్ వైడ్ రిలీజ్ చేస్తున్నాం
### ప్రెస్ మీట్‌లో ప్రముఖ నిర్మాత దిల్ రాజు

ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. తరుణ్ భాస్కర్ గాయపడ్డ సింహం గురించి చెప్పారు. పవన్ ని ఈ సినిమా కాన్సెప్ట్ గురించి అడిగాను. ముందు ఈ టీజర్ చూపించారు. టీజర్ చాలా నచ్చింది. తర్వాత మొత్తం కాన్సెప్ట్ చెప్పారు. నాకు చాలా నచ్చింది. దీంతో ఈ సినిమాని ప్రపంచవ్యాప్తంగా మేము రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చాం. కాన్సెప్ట్ చాలా బాగుంది. టీజర్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మంచి హ్యూమర్ ఉన్న సినిమా ఇది. ఈ సినిమాని మా ఎస్విసి ద్వారా వరల్డ్ వైడ్ రిలీజ్ చేయబోతున్నాం. టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. ప్రమోషన్స్‌కి కొత్తగా ప్రయత్నం చేయాలని ఈ ఇలా యూనిక్‌గా ఈవెంట్ ని నిర్వహించడం జరిగింది. మే 1 ఈ సినిమా రిలీజ్ అవుతుందని రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడం జరిగిందన్నారు. అయితే దానికి కూడా కండిషన్స్ అప్లై. ఎందుకంటే ఏప్రిల్ 30కి పెద్ది సినిమా ఆల్రెడీ అనౌన్స్ అయింది. ఆ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ ఉంటుంది. ఆ సినిమా వచ్చినప్పుడు ఈ సినిమాకి థియేటర్స్ మేమే ఇవ్వలేని పరిస్థితి ఉంటుంది. కాబట్టి కండిషన్స్ అప్లై అని చెప్పాము. మళ్ళీ మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. అవసరమనకుంటే ఒక వారం రోజులు వెనక్కి జరుపుకునే అవకాశం కూడా ఉంటుంది. మంచి కాన్సెప్ట్ తో ఈ సినిమా చేసినందుకు టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్.

ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. దిల్ రాజు ఈ సినిమాని రిలీజ్ చేయడానికి తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మాలాంటి యంగ్ ఫిలిం మేకర్స్ ని సపోర్ట్ చేస్తున్న దిల్ రాజు గారికి థాంక్యూ సో మచ్. పవన్ సాదినేని మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ కి సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో చాలా సర్ ప్రైజ్ లు ఉంటాయి. ఒకదాని తర్వాత ఒకటి మేము రివిల్ చేస్తాము. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ సినిమా రిలీజ్ చేస్తున్న దిల్ రాజుకి ధన్యవాదాలు. మా అందరికీ సపోర్ట్ గా దిల్ రాజు రావడం చాలా పాజిటివ్ గా ఉంది. గాయపడ్డ సింహం మే 1, థియేటర్స్‌లో కలుద్దాం. తారాగణం: తరుణ్ భాస్కర్, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి, విష్ణు ఓయి, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్, తదితరులు.

## ఏప్రిల్ 10న పళ్లిచట్టంబి



### విడుదలైన టొవినో థామస్ కొత్త మూవీ టీజర్

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూ 'పళ్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. 'పళ్లిచట్టంబి' సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఏప్రిల్ 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. సోమవారం 'పళ్లిచట్టంబి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే - ప్రఖ్యాతి గాంచిన ఒక పురాతన చర్చి నేపథ్యంగా ఆసక్తికరంగా ఈ టీజర్ ప్రారంభమవుతుంది. ఆ భగవంతుడి ఆలయం మీద కొందరు దెయ్యాల్లాంటి మనుషుల కన్నుపడుతుంది. ఆ రాక్షసులు అమాయకులైన ప్రజల్ని హింసించడం టీజర్‌లో చూపించారు. 'మనుషులు సైతాను ఎదురెదురుగా ఉండే ప్రదేశంలో దేవుడితో పనేంటి..' అనే డైలాగ్ ఈ మూవీ నేపథ్యం, కథలోని కాన్ ఫ్లిక్ట్ ఎలా ఉండబోతోంది అనే అంశాలపై క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ ఆలయాన్ని, అమాయక ప్రజల్ని కాపాడేందుకు కథానాయకుడు ఎలాంటి పోరాటం చేశాడు అనేది టీజర్ కు హైలైట్ గా నిలుస్తోంది. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ సరికొత్తగా కనిపించి ఆకట్టుకుంటున్నారు. నటీనటులు – టొవినో థామస్, కయదు లోహర్, విజయరాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెక్జాండర్, తదితరులు.

## మార్చి 28న డెకాయిట్ సెకండ్ సింగిల్ చిచ్చుబుడ్డి



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ 'రుబారు'.. అన్నీ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. డెకాయిట్ సెకండ్ సింగిల్ చిచ్చుబుడ్డి మార్చి 28న రిలీజ్ కానుంది. ఇది అదిరిపోయే డాన్సింగ్ నెంబరు. ఈ పాట కోసం చార్ట్ బస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్లో అడివి శేష్ డాన్సింగ్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా ఉండబోతున్నాయి.

ఈ మూవీని ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న 'డెకాయిట్'కి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్ రగ్డ్ విజువల్స్‌ను అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది. ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతున్న 'డెకాయిట్' లవ్, హార్ట్‌బ్రేక్, అద్భుతమైన యాక్షన్‌తో ఆడియన్స్‌కి సీట్ ఎడ్జ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది.

## ప్రపంచవ్యాప్తంగా దురంధర్ తుఫాను
## ధురంధర్ ది రివెంజ్ రూ.761



జియో స్టూడియోస్ అండ్ బి62 స్టూడియోస్ నిర్మాణంలో ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ధురంధర్ రివెంజ్, బాక్స్–ఆఫీస్ చరిత్రను తిరగరాసింది. ఇది ఆల్ టైం గ్లోబల్ ఇండియన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, అపూర్వమైన ఓపెనింగ్ వీకెండ్‌ను అందించి, ప్రపంచవ్యాప్తంగా కొత్త రికార్డులను నెలకొల్పింది. అసాధారణమైన అడ్వాన్స్ బుకింగ్‌లు, అన్ని సర్క్యూట్‌లలో హౌస్‌ఫుల్ అయిన షోలు, ఈ ఫ్రాంచైజీ తదుపరి భాగం కోసం ఉన్న అసాధారణమైన అంచనాల కారణంగా, ఈ చిత్రం దేశీయంగా, విదేశాలలో ఆల్ టైం అత్యధిక వసూళ్లను సాధించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఒక భారతీయ చిత్రానికి ఇదే అతిపెద్ద ఓపెనింగ్ వీకెండ్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా బిగ్గెస్ట్ హిందీ బ్లాక్‌బస్టర్ అయిన 'ధురంధర్' సాధించిన అద్భుతమైన విజయ పరంపరను కొనసాగిస్తూ, ఈ సీక్వెల్ ఫ్రాంచైజీని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లింది. అత్యధిక పెయిడ్ ప్రివ్యూలు, అతిపెద్ద ఓపెనింగ్ డే, అతిపెద్ద శనివారం, అతిపెద్ద ఆదివారం, ప్రపంచవ్యాప్తంగా ఏ భారతీయ చిత్రానికైనా అత్యధిక ఓపెనింగ్ వీకెండ్ వసూళ్లతో ఇది చరిత్ర సృష్టించింది. కేవలం ఓపెనింగ్ వీకెండ్‌లోనే ప్రపంచవ్యాప్తంగా ₹761 కోట్ల భారీ వసూళ్లతో, ధురంధర్ రివెంజ్ ప్రపంచ వేదికపై భారతీయ సినిమాకు ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. దురంధర్ తుఫాను.. ప్రపంచవ్యాప్తంగా చరిత్రను తిరగరాసింది.

**రోజువారీ వసూళ్ల వివరాలు...**

*పెయిడ్ ప్రివ్యూలు + మొదటి రోజు (గురువారం) – ₹145 కోట్లు ఇండియా (నెట్) | ₹52 కోట్లు ఓవర్సీస్*
*రెండవ రోజు శుక్రవారం – ₹83 కోట్లు ఇండియా (నెట్) | ₹46 కోట్లు ఓవర్సీస్*
*మూడవ రోజు శనివారం – ₹117 కోట్లు ఇండియా (నెట్)| ₹58 కోట్లు ఓవర్సీస్*
*నాల్గవ రోజు, ఆదివారం–₹121 కోట్లు ఇండియా (నెట్)| విదేశాలలో ₹56 కోట్లు*

## సంబరాల ఏటిగట్టు నుంచి బ్రిటిషుగా శ్రీకాంత్

**- బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్**



మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్–ఇండియా స్పెక్టికల్ ఎస్‌వైజీ (సంబరాల ఏటిగట్టు) తో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్–ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్స్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో సీనియర్ హీరో శ్రీకాంత్ పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఈ రోజు శ్రీకాంత్ బర్త్ డే సందర్భంగా ఆయన్ని బ్రిటిషుగా పాత్రలో ప్రజెంట్ చేస్తూ కొత్త పోస్టర్ రిలీజ్ రిలీజ్ చేశారు. ప్రతి గాయాన్ని ఒక పతకంలా ధరించే సైనికుడుగా ఆయన లుక్ అదిరిపోయింది. ఈ పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని వెట్రివేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయకృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ పాన్–ఇండియా విడుదలకు సిద్ధమవుతున్న "సంబరాల ఏటిగట్టు" ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్ గా నిలుస్తోంది.

# గద్దర్ అవార్డ్ ఒక స్ఫూర్తి
## మెగాస్టార్ చిత్రానికి సంగీతం అందించడమే నా డ్రీమ్

**- మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ కె రాబిన్**

కొందరు తమ గోరంత ప్రతిభను కొండంతలుగా చెప్పుకుంటారు. మరికొందరు ఎంత ప్రతిభావంతులైనా ప్రచారాలకు దూరంగా ఉంటూ తమ పని తాము చేసుకుపోతుంటారు. ఈ రెండో కేటగిరీకి చెందిన యంగ్ టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ మార్క్ కె రాబిన్. తన 8 ఏళ్ల సంగీత ప్రస్థానంలో 20 కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించారు మార్క్ కె రాబిన్. వాటిలో నాగార్జున నటించిన ది ఘోస్ట్, ప్రియదర్శి మల్లేశం, తేజ సజ్జ జాంబీరెడ్డి, తాప్సీ మిషన్ ఇంపాజిబుల్, నవీన్ పోలిశెట్టి నటించిన ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ వంటి విజయవంతమైన చిత్రాలున్నాయి. తాజాగా దండోరా సినిమాకు బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డ్‌ను సొంతం చేసుకున్నారు మార్క్ కె రాబిన్. ఈ సందర్భంగా సంగీత దర్శకుడిగా తన ప్రస్థానాన్ని, తన ప్రయాణంలోని విశేషాలను వెల్లడించారు.

✧ దండోరా సినిమాకు బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా గద్దర్ అవార్డ్ దక్కడం సంతోషంగా ఉంది. ప్రేక్షకులకు మరింత మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు ఒక స్ఫూర్తిగా ఈ అవార్డ్ నిలుస్తుందని నమ్ముతున్నాను. గద్దర్ అవార్డ్ తో సంగీత దర్శకుడిగా నాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను. గద్దర్ అవార్డ్ ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా.డైరెక్టర్ మురళి చాలా క్లారిటీగా సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలోని కథాంశమే నన్ను మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు ఇన్స్ పైర్ చేసింది. కులాల మధ్య ఉన్న అడ్డుగోడలు, చివరకు చనిపోయాక అంతిమ సంస్కారాలు కూడా చేయకుండా అడ్డుకోవడం, ఒక బ్రిడ్జి మీద నుంచి శవాలను నీటిలోకి దింపడం వంటివి దర్శకుడు చెప్పాక నా మనసు చలించింది. భావోద్వేగం నిండిన మనసుతోనే దండోరా సినిమాకు సంగీతాన్ని అందించాను. దండోరా సినిమాలో స్థానిక వాయిద్యాలతో సంగీతం కంపోజ్ చేశాను. నేను మల్లేశం సినిమాకు మ్యూజిక్ చేసేప్పుడే నాకు ఈ స్థానిక వాయిద్యాలు, స్థానిక సంగీతం మీద అవగాహన ఉంది. ఆ అనుభవం దండోరా సినిమాకు నాకు ఉపయోగపడింది.

✧ నాకు బాల్యం నుంచే సంగీతం మీద ఇష్టం ఉండేది. నేను టీచర్‌గా వర్క్ చేశాను. లిరిసిస్ట్ కృష్ణకాంత్ నాకు మంచి మిత్రుడు. కృష్ణకాంత్, ప్రశాంత్ వర్మ, నేను కలుస్తుండేవాళ్లం. ప్రశాంత్ నేను కలిసి డైలాగ్ ఇన్ ది డార్క్ అనే ఇండియా ఫస్ట్ వర్చువల్ ఆడియో షార్ట్ ఫిలిం చేశాం. నాని హీరోగా నటించిన మజ్ను మూవీ ట్రైలర్ కు బీజీఎం ఇచ్చాను. ఆ ట్రైలర్ కు నేను అందించిన సంగీతం నచ్చి నాని తను నిర్మిస్తున్న అ..! సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ గా అవకాశం కల్పించారు. ఆ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. అలా టాలీవుడ్ లో సంగీత దర్శకుడిగా నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత 8 ఏళ్ల ప్రయాణంలో ది ఘోస్ట్, మల్లేశం, జాంబీరెడ్డి, మిషన్ ఇంపాజిబుల్, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, సూర్యకాంతం...ఇలా 20కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించాను. సినిమాలు చేసుకుంటూ వెళ్లడమే గానీ వాటి గురించి మీడియా ఇంటర్వ్యూస్ లో, ఇతర ప్రచార కార్యక్రమాల్లో ఎక్కువగా చెప్పుకోలేదు. నేను కాస్త ఇంట్రోవర్ట్.

✧ నాకు కమర్షియల్ సినిమాలు చేయడం ఇష్టం. నా ఫస్ట్ వర్క్ నాని మజ్ను సినిమాకు చేశా. అది కమర్షియల్ మూవీ. స్టార్ హీరోస్ కు ఎలాంటి బీజీఎం ఇవ్వాలి అనేది పూర్తిగా అవగాహన ఉంది. ప్రభాస్ కోసం కొన్ని బీజీఎంలు చేసి పెట్టాను. మెగాస్టార్ చిరంజీవి గారంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాకు మ్యూజిక్ చేయాలనేది నా డ్రీమ్. ఇటీవల గద్దర్ అవార్డ్స్ లో ఆయనను కలిసి దగ్గరగా చూశాను, షేక్ హ్యాండ్ ఇచ్చాను. ఆ సందర్భం ఒక స్వీట్ మెమొరీగా గుర్తుండిపోతుంది.

✧ ప్రస్తుతం మ్యూజిక్ డైరెక్టర్స్ యూత్ కు నచ్చే మంచి మంచి సౌండింగ్స్ ఇవ్వగలుగుతున్నారు. కానీ కలకాలం గుర్తుండిపోయే ట్యూన్స్ ఇవ్వలేకపోతున్నారు. అందుకే ఇప్పటి యూత్ ఏఆర్ రెహమాన్, ఇళయరాజా పాటలు వింటూ ఆ పాటలకు డ్యాన్సులు చేస్తున్నారు. ఇప్పటి పాటల్లో శబ్దాల హోరు పెరిగింది. సాహిత్యం వినిపించడం లేదు. ట్యూన్ శరీరం అయితే, సాహిత్యం ఆత్మ లాంటిది అని నా అభిప్రాయం. పరభాషా సంగీత దర్శకులు, సింగర్స్ ను మనం ప్రోత్సహిస్తున్నాం. మంచిదే కానీ వారికి మన భాష మీద పట్టులేక తెలిసినంతలో అలాగే పాడుతున్నారు. దాంతో వాళ్ల ఉచ్చారణల్లో తప్పులు వస్తున్నాయి. నా సినిమాల్లో సాధ్యమైనంత మన వాళ్లతోనే పాడిస్తున్నాను.

✧ నేను చేసే పాటలన్నీ మంచి సాహిత్యంతో, గుర్తుండిపోయే ట్యూన్ తో ఉండాలనే ప్రయత్నిస్తుంటాను. అయితే సినిమా సంగీతం ఎప్పుడూ ఒక పరిధిలోనే ఉంటుంది. అంటే దర్శకుడి టేస్ట్ మేరకు మేము పాటలు కంపోజ్ చేయాలి. మంచి మ్యూజిక్ టేస్ట్ ఉన్న దర్శకులతో పనిచేసినప్పుడే మంచి పాటలు చేయగలం. మణిరత్నం లాంటి దర్శకుల సినిమాల్లో సంగీత పరంగా ఆ ప్రత్యేకత మనం గమనించగలం.

✧ సంగీతంలో టెక్నాలజీ ఎంత అందుబాటులోకి వచ్చినా మనం సొంతంగా క్రియేట్ చేసే పాటతో అది పోటీ రాదు. మనలోని సృజనాత్మకతతో రూపొందించే పాటను అంతే అనుభూతితో ఏఐ అందించలేదు. ఏఐకి కూడా మన ఇన్ పుట్స్ అవసరం. ఫలానా పాట చేయమని సూచనలు చేస్తే అలాంటి పాటే చేసి ఇస్తుంది.

✧ తెలుగు సినిమా పరిశ్రమ గొప్పగా ఎదిగింది. ఇక్కడ గొప్ప చిత్రాలు నిర్మిస్తున్నాం. అయితే మ్యూజిక్ ఇండస్ట్రీ పరంగా ఇక్కడ ఆ స్థాయి సౌకర్యాలు లేవు. ఒక మంచి మ్యూజిక్ స్టూడియో, ఒక మంచి రికార్డింగ్ చేయాలంటే చెన్నైకి వెళ్తున్నాం. మన ఇండస్ట్రీ పెరిగినంత స్థాయిలో, మన సినిమా అవసరాలు తీర్చేంత మ్యూజిక్ స్టూడియోలు, వాయిద్యకారులు అందుబాటులో లేరు. మీకు ఏ వాయిద్యం కావాలన్నా వాయించగల వారు చెన్నైలో అందుబాటులో ఉంటారు. వాళ్ల సమయపాలన, సంగీత ప్రతిభ ఆశ్చర్యపరుస్తాయి. కోవిడ్ టైమ్‌లో మనకున్న అరా కొరా రికార్డింగ్ స్టూడియోల్లో కూడా కనీస ఉపాధి, వ్యాపారం లేకుండా పోయాయి. ఇప్పుడిప్పుడే వారికి కొంత ఉపాధి లభిస్తోంది. చెన్నై మీద ఆధారపడే పరిస్థితి పూర్తిగా మారాల్సిన అవసరం ఉంది. అలాగే స్థానిక వాయిద్యకారులను, సంగీత కళాకారులను గుర్తించి ప్రోత్సాహం అందించాలి. అలాంటి ఒక మంచి లోకల్ టీమ్ ను తయారుచేసే ప్రయత్నాలు చేస్తున్నాను.

✧ ప్రస్తుతం కథాకళి అనే ఒక సినిమా చేస్తున్నాను. అలాగే ప్రశాంత్ వర్మతో రెండు మూవీస్ చేస్తున్నాను. ఒక స్టార్ హీరో సినిమాకు చర్చలు జరుగుతున్నాయి. త్వరలో వెల్లడిస్తాను.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.